



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 150 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 11 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 150 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SAT 11 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# దందా ఆపకపోతే ఈడీకి ఫిర్యాదు చేస్తాం

- గుంపు మేస్త్రీ అంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా కల్వకుంట్ల కవిత ఘాటు విమర్శలు
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందన్న కవిత
- ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో రేవంత్ కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని ఆరోపణ
- నిధులు దారిమళ్లిస్తున్నారంటూ విమర్శలు



**హైదరాబాద్ పెన్ పవర్:**సీఎం రేవంత్‌రెడ్డి జీహెచ్ఎంసీని అవినీతికి కేరాఫ్‌గా మార్చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. టెండర్లు లేకుండానే కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్ట్‌లను తన అనుచరులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలో జరుగుతున్న అవినీతిపై శుక్రవారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దాదాపుగా రూ.1,148 కోట్ల కాంట్రాక్టులను నామినేషన్ పద్ధతిలో ఇచ్చారని చెప్పారు. రూ.5 లక్షలకు మించి ఉండే ఏ పని అయినా సరే టెండర్లు పిలవాల్సి ఉన్నా.. నిబంధనలు ఉల్లంఘిస్తూ కోట్ల రూపాయల పనులను టెండర్లు లేకుండానే కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఇది తెలంగాణ స్టేట్ ఫైనాన్షియల్ కోడ్‌ను ఉల్లంఘించటమేనని చెప్పారు. టెండర్లు లేకుండా కాంట్రాక్ట్ ఇవ్వవద్దని 2023 లో ఏర్పాటైన కమిటీ కూడా స్పష్టం చేసిందని కవిత గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.480 కోట్ల పనులను ఇదే విధంగా కట్టబెడితే.. రేవంత్‌రెడ్డి సర్కార్ దాన్ని కొనసాగిస్తూ రూ.1,148 కోట్ల పనులను తన అనుచరులకు నామినేషన్ పద్ధతిలో ఇచ్చిందని చెప్పారు. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన ఓ కంపెనీపై వేసిన సిట్ ఏమైందని ప్రశ్నించారు. సీఎంతో సిట్టింగ్ అవటంతో ఆ సిట్‌ను పత్తా లేకుండా చేశారా అని అనుమానం వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డును కాంట్రాక్టర్ కు అప్పగించి...అక్కడి మెయింటెనెన్స్ ను ప్రభుత్వం చేస్తుండటం అత్యంత దారుణమని

మిగతా 2లో

## బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన పొంగులేటి..

### తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని వ్యాఖ్య



- కూసుమంచి మండలంలో కొత్తగా నిర్మించిన గోదామును ప్రారంభించిన పొంగులేటి
- గత ప్రభుత్వ ధరణి పోర్టల్ వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్న మంత్రి
- రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12 వేలు అందిస్తున్నామని వెల్లడి
- ఇందిరమ్మ రాజ్యాన్ని మరోసారి దీవించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్య

మిగతా 2లో

## డీలిమిటేషన్‌పై CM రేవంత్ యుద్ధం.. కేంద్రానికి సంచలన హెచ్చరిక



**హైదరాబాద్ పెన్ పవర్:**నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో జరిపిన చిట్‌చాట్‌లో పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్ అనేది కేవలం రాజకీయ పార్టీల సమస్య కాదని, ఇది ప్రాంతాల అస్తిత్వానికి సంబంధించిన సమస్య అని ఆయన స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కేంద్రం ఆడుతున్న రాజకీయ డ్రామా అని సీఎం విమర్శించారు. “మహిళా రిజర్వేషన్లు ఇవ్వడానికి పునర్విభజన అవసరమే లేదు. కానీ, దీని సాకుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాముఖ్యతను

మిగతా 2లో



## నమాజ్ కోసం ఉగ్రవాదులపై దాడిని వాయిదా వేశాం..

### ఆపరేషన్ సిందూర్ రహస్యాలు వెల్లడించిన ఆర్మీ చీఫ్

- ఉగ్రవాద శిబిరంపై దాడిని నమాజ్ కోసం వాయిదా వేసిన సైన్యం
- ‘అందరి దేవుడు ఒక్కడే’ అనే భావనతోనే ఈ నిర్ణయమన్న ఆర్మీ చీఫ్
- సైన్యంలో మహిళల చేరికపై కుమార్తెల సలహాలు తీసుకుంటానన్న జనరల్ ద్వివేది
- మార్కుల కన్నా వ్యక్తిత్వం, పరిస్థితులకు అనుగుణంగా మారడమే ముఖ్యం

మిగతా 2లో



## భాగ్యనగరంలో ‘ప్రేమ’ ముసుగులో మతం మార్పిడి దందా

### అన్నదమ్ముల ఘాతుకం వెలుగులోకి

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో హిందూ యువతులను లక్ష్యంగా చేసుకుని సాగు తున్న ఒక దారుణమైన

మిగతా 2లో



## ‘అన్నా.. మీతో కలిసి పనిచేయమని దేవుడు పంపించాడన్నా’

- కేసీఆర్‌ను కలిసిన జీవన్ రెడ్డి.. ‘దేవుడే నన్ను పంపాడు’ అంటూ భావోద్వేగం
- ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్‌లో కేసీఆర్‌ను కలిసిన జీవన్ రెడ్డి
- సాదరంగా ఆహ్వానించిన కేటీఆర్ తదితరులు
- ప్రస్తుత తరుణంలో కేసీఆర్ నాయకత్వంలో పనిచేయాల్సిన అవసరం ఉందన్న జీవన్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఘట్టం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఈరోజు కలిశారు. కేసీఆర్ ఆయనను సాదరంగా ఆహ్వానించి, ఆలింగనం చేసుకుని, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డితో పాటు ఆయన కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కూడా ఆయనతో పాటు ఉన్నారు. పాత మిత్రులు కలవడంతో అక్కడ ఎంతో ఆత్మీయ వాతావరణం నెలకొంది. కేసీఆర్‌ను చూడగానే జీవన్ రెడ్డి ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. “అన్నా.. నన్ను దేవుడే మీ దగ్గరికి పంపాడు, మీతో కలిసి పనిచేయమని కోరాడు” అంటూ తన మనసులోని మాటను పంచుకున్నారు. తెలంగాణకు నష్టం జరుగుతున్న ప్రస్తుత తరుణంలో కేసీఆర్ నాయకత్వంలో పనిచేయాల్సిన అవసరం ఉందని జీవన్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. చాలా కాలం తర్వాత ఇన్నాళ్లకు కలిసి పనిచేసే అవకాశం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అంతకు ముందు, ఎర్రవెల్లికి చేరుకున్న జీవన్ రెడ్డికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఇతర ముఖ్య నేతలు ఘనస్వాగతం పలికారు.




## ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే.. రూ.8 లక్షల కోట్ల అప్పు ఎందుకు?

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఏప్రిల్ 10, 2026న జరిగిన విలేకరుల సమావేశంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 2014లో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను గత పదేళ్ల పాలనలో భారీ అప్పుల ఊబిలోకి నెట్టారని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వం రాష్ట్రంపై దాదాపు 8 లక్షల కోట్ల అప్పు భారాన్ని మోపిందని, ఈ స్థాయి అప్పులు చేసినా రాష్ట్రానికి తగిన స్థాయిలో ఆస్తులు సృష్టించలేదని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల

మిగతా 2లో

## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!



- తుది దశకు చేరుకున్న భోగాపురం విమానాశ్రయం పనులు
- మోదీకి నాలుగు తేదీలను సూచించిన ఏపీ ప్రభుత్వం
- ఈ విమానాశ్రయంతో మారిపోనున్న ఉత్తరాంధ్ర రూపురేఖలు

మిగతా 2లో



## యూపీలో పడవ బోల్తా... 10 మంది మృతి...

### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

- మధురలోని యమునా నదిలో పడవ బోల్తా
- ప్రమాదంలో 10 మంది యాత్రికులు మృతి
- 14 మందిని కాపాడిన సహాయక బృందాలు
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- ప్రమాదంపై ప్రధాని, యూపీ సీఎం దిగ్భ్రాంతి

**పెన్ పవర్ డెస్క్:**ఉత్తరప్రదేశ్‌లోని మధుర జిల్లాలో ఘోర పడవ ప్రమాదం జరిగింది. బృందావన్‌లోని కేశీఘాట్ వద్ద యమునా నదిలో యాత్రికులతో వెళుతున్న పడవ బోల్తా పడటంతో 10 మంది మృతి చెందారు. మరో 14 మందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.వివరాల్లోకి వెళితే, పంజాబ్‌కు చెందిన సుమారు 30 మంది యాత్రికులు శుక్రవారం మధ్యాహ్నం పడవలో యమునా నదిలో ప్రయాణిస్తున్నారు.

మిగతా 2లో

## లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు.. కీలక వ్యాఖ్యలు చేసిన తెలంగాణ డీజీపీ

- లొంగిపోయిన వారిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ స్థాయి నేత కేశాలు
- ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయారన్న డీజేపీ
- తెలంగాణలో నలుగురు మావోయిస్టులు మాత్రమే మిగిలిపోయారని వెల్లడి
- వారు కూడా లొంగిపోవాలని పిలుపు

**హైదరాబాద్ పెన్ పవర్::**తెలంగాణలో మావోయిస్టుల కార్యకలాపాలు క్రమంగా తగ్గుముఖం పడుతుండగా, తాజాగా భారీ సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో మొత్తం 42 మంది మావోయిస్టులు తమ ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలోకి చేరారు. లొంగిపోయిన వారిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ స్థాయి కలిగిన కేశాలు

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# ప్రజారోగ్యంపై కల్తీ ప్రభావం!

నిత్యం మనం తీసుకునే ఆహారం అమృతం కావాలి. కానీ నేడు అది నెమ్మదిగా ప్రాణాలను హరించే విషంగా మారుతోంది. లాభాపేక్ష అనే రాక్షసి కోరల్లో చిక్కుకున్న ఆహార రంగం, సామాన్యుడి ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది. 'సర్వం కల్తీమయం' అన్నది కేవలం ఒక నానుడి కాదు. నేడు అది మన కళ్లముందు కదలాడుతున్న భయంకర వాస్తవం. భారతదేశంలో సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు పెరగడం అటుంచితే, కనీస ఆరోగ్య భద్రత కరువవ్వడం ఆందోళన కలిగించే అంశం. వాతావరణ కాలుష్యం ఒకవైపు ఊపిరితిత్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, మరోవైపు మనం తినే ఆహారంలో చేరుతున్న రసాయనాలు నిశ్శబ్దంగా మృత్యువును ఆహ్వానిస్తున్నాయి. ఉదయం నిద్రలేచిన దగ్గరి నుండి వాడే టూత్‌పేస్ట్, పాలు, టీపొడి, వంటనూనె, పప్పుధాన్యాలు.. ఇలా ఒకటేమిటి, ఏ వస్తువును తాకినా అందులో కల్తీ ఉందన్న వార్తలు వినియోగదారుడి వెన్నులోవణుకు పుట్టిస్తున్నాయి. గతంలో కల్తీ అంటే ఏదో ఒక వస్తువులో తక్కువ నాణ్యత గల పదార్థాలను కలపడం అని అనుకునేవారు. కానీ నేడు అది ఒక వ్యవస్థీకృత నేరంగా రూపాంతరం చెందింది. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన దాడులు చూస్తుంటే, ఒక భారీ నెట్‌వర్క్ దీని వెనుక ఉన్నట్లు అర్థమవుతోంది. పాలు, పాల ఉత్పత్తులు: సూరత్ వంటి నగరాల్లో యూరియా, డిటర్జెంట్, ప్రాణాంతక రసాయనాలతో 'సింథటిక్ పాలు' తయారు చేయడం మానవత్వం లేని చర్య. పసిపిల్లలు తాగే పాలపై కూడా కనికరం లేని లాభాపేక్ష ఇది. పన్నీర్, నెయ్యిలో జంతువుల కొవ్వును కలపడం వంటి ఘటనలు ఆధ్యాత్మిక భావనలతోపాటు ఆరోగ్య భద్రతను కూడా దెబ్బతీస్తున్నాయి. ఢిల్లీలో వెలుగులోకి వచ్చిన నకిలీ టూత్‌పేస్ట్ తయారీ కేంద్రం మన దైనందిన జీవితంలో ఏ వస్తువునూ నమ్మలేమని నిరూపించింది. బ్రాండెడ్ కంపెనీల పేర్లతో నకిలీ ప్యాకింగ్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు.

రీ–లేబులింగ్ మాఫియా: గడువు ముగిసిన సాఫ్ట్‌డ్రింక్స్, ప్యాక్డ్ ఫుడ్స్‌పై పాత తేదీలను చెరిపివేసి కొత్త తేదీలు ముద్రించడం ద్వారా వినియోగదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో నగర జీవనం చాలా వేగంగా మారిపోయింది. ఉరుకులు పరుగుల జీవితంలో సొంతంగా వంట చేసుకునే తీరిక లేక చాలామంది బయటి ఆహారంపై ఆధారపడుతున్నారు. బిర్యానీ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ అవుట్‌లెట్లు నేడు ప్రతి గల్లీలోనూ దర్శనమిస్తున్నాయి. అయితే, ఈ కేంద్రాల్లో శుభ్రత అనేది మచ్చుకైనా కనిపించడం లేదు. హైదరాబాద్ వంటి నగరాల్లో వెలుగులోకి వచ్చిన అల్లం– వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రాల పరిస్థితి దారుణం. కుళ్ళిన అల్లం, వెల్లుల్లికి రంగులు, రసాయనాలు కలిపి ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో హోటళ్లకు సరఫరా చేస్తున్నారు. ఇలాంటి పదార్థాలను వాడటం వల్ల హోటల్ ఆహారం రుచికరంగా ఉన్నట్లు అనిపించినా, అది లోలోపల అవయవాలను చిత్తు చేస్తోంది. కల్తీ ఆహారం అనేది కేవలం ఒక వ్యక్తిగత సమస్య కాదు, ఇది దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రజారోగ్య సంక్షోభం. కల్తీ వల్ల కలిగే నష్టాలు తక్షణమే బయటపడవు. కానీ దీర్ఘకాలంలో అవి ప్రాణాంతకమవుతాయి. కేన్సర్ ముప్పు: వైద్య నిపుణుల నివేదికల ప్రకారం, దేశంలో నమోదవుతున్న కేన్సర్ కేసుల్లో సుమారు 53% ఆహారపు అలవాటు, కల్తీ ఆహారం వల్లే సంభవిస్తున్నాయి. ఆహారంలో కలిపే కృత్రిమ రంగులు కార్సినోజెనిక్‌గా మారుతున్నాయి. కలుషిత నీరు, కల్తీ పాలు, నాణ్యత లేని నూనెల వల్ల కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటున్నాయి. చిన్న వయస్సులోనే గుండెపోటులు రావడం వెనుక కల్తీ నూనెల ప్రభావం ఎంత ఉందో విశ్లేషించాల్సిన అవసరం ఉంది.

పాలలో కలిపే ఆక్సిటోసిన్ వంటి హార్మోన్ల వల్ల పిల్లల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. నిఘా వైఫల్యం ప్రశ్నలపై ఉక్కుపాదం ఆహార భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించాల్సిన 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా', రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్యశాఖలు క్షేత్రస్థాయిలో విఫలమవుతున్నాయని చెప్పక తప్పదు. తనిఖీలు కేవలం పండుగ సీజన్లకు లేదా ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే పరిమితం కాకూడదు. మరోవైపు, సోషల్ మీడియా యుగంలో ప్రజలు చైతన్యవంతులవుతున్నారు. ఆహార నాణ్యతను ప్రశ్నించే వారిపై రివర్స్ కేసులు నమోదు చేయడం లేదా వారిని వేధించడం ప్రజాస్వామ్య విరుద్ధం. ప్రశ్నించే గొంతును నొక్కేయడం వల్ల సమస్య పరిష్కారం కాదు, అది మరింత విస్తరిస్తుంది. ప్రభుత్వాలు పారదర్శకతను పెంచాలి. తనిఖీ వివరాలను, కల్తీకి పాల్పడే సంస్థల పేర్లను బహిరంగ పరచాలి.

ప్రభుత్వం కేవలం జరిమానాలతో సరిపెట్టకుండా, కల్తీకి పాల్పడే వారిని సామాజిక నేరగాళ్లుగా పరిగణించి కఠిన శిక్షలు అమలు చేయాలి. ఆహార కల్తీకి పాల్పడే వారికి జీవిత ఖైదు వంటి కఠిన శిక్షలు పడేలా చట్టాలను సవరించాలి. హోటళ్లు, తయారీ కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిరంతర ప్రక్రియగా మారాలి. డిజిటల్ ట్రాకింగ్ ద్వారా ఆహార పదార్థాల మూలాలను గుర్తించే వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రతి జిల్లా కేంద్రంలో అత్యాధునిక ఆహార పరీక్షా ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలి. సామాన్య ప్రజలు కూడా అతి తక్కువ ధరకే తమ ఆహారాన్ని పరీక్షించుకునే సౌలభ్యం కల్పించాలి. ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా, ప్రజల్లో చైతన్యం లేనిదే మార్పు రాదు. ఏదైనా వస్తువు కొనే ముందు ఎక్స్‌పైరీ డేట్, తయారీదారు వివరాలు, ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ లోగోను తప్పనిసరిగా చూడాలి. వీలైనంత వరకు ప్రాసెస్ చేసిన ఆహారం కాకుండా ప్రకృతి సిద్ధమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. బయట ఆహారం తీసుకునేటప్పుడు కేవలం పేరు ప్రఖ్యాతులు కాకుండా, అక్కడ పాటించే పరిశుభ్రతను కూడా గమనించాలి. నాణ్యత లేని వస్తువును చూసినప్పుడు మౌనంగా ఉండకుండా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం బాధ్యతగా భావించాలి. ఆరోగ్యమే మహాభాగ్యం. ఆ భాగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వ్యాపారులు లాభాల వేటలో ప్రాణాలను బలితీసుకోవడం ఆపాలి. ప్రభుత్వం తన నిద్రావస్థను వీడి, ఉక్కుపాదంతో కల్తీ మాఫియాను అణచివేయాలి. సమాజం పార్టీ సంస్కృతికి, నిల్వఉంచిన రుచికరమైన విషాలకు దూరంగా ఉండాలి. మనం ఇప్పుడే మేల్కోకపోతే, రేపటి తరం ఒక అనారోగ్యకరమైన సమాజంలో బతకాల్సి వస్తుంది. ఆహార భద్రత అనేది కేవలం ఒక నినాదం కాదు, అది ఒక ప్రాథమిక హక్కు. ఆ హక్కును కాపాడుకోవడానికి పౌర సమాజం సిద్ధం కావాలి.

## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జూలై 5 లేదా 8వ తేదీల్లో ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్ పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

# బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన పొంగులేటి..

తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా, కారుకూతలు కూసినా ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని, ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు తాము బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో నూతనంగా నిర్మించిన గోదాము ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం సేకరించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12,000 అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు దానిని బంగాళాఖాతంలో కలిపి, పారదర్శకమైన 'భూ భారతి' విధానాన్ని తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఎనభై వేల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా ఐదు వందల రూపాయల బోనస్ ఇస్తున్నామని, పండించిన సన్న బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించకుండా రేషన్ ద్వారా రాష్ట్రంలోని పేదలకు అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సీపీ సునీల్ దత్ మరియు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# డీలిమిటేషన్‌పై CM రేవంత్ యుద్ధం.. కేంద్రానికి సంచలన హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

తగ్గించాలని కేంద్రం కుట్ర చేస్తోంది. డీలిమిటేషన్ వల్ల ఉత్తరాది రాష్ట్రాల ఎంపీ సీట్లు 600 దాటితే, దక్షిణాది సీట్లు కేవలం 195 దగ్గరే ఆగిపోతాయి. అప్పుడు కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సౌత్ ఇండియా అవసరమే ఉండదు. ఇదే కేంద్రం అసలు ప్లాన్" అని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

**దక్షిణాదిపై వివక్ష.. తిరుగుబాటు తప్పదు!**

దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటికే పన్నుల వాటాలో, నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయానికి గురవుతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. "సౌత్ ఇండియా ఫైనాన్షియల్ క్యాపిటల్‌గా ఉంటే, నార్త్ ఇండియా పొలిటికల్ క్యాపిటల్‌గా మారింది. ఎన్నో ఏళ్లుగా మమ్మల్ని సెకండ్ గ్రేడ్ సిటిజన్స్‌గా చూస్తున్నారు. ఇప్పటికే గాయపడి ఉన్న దక్షిణాది రాష్ట్రాలపై ఇంకా అన్యాయం చేస్తామంటే ప్రజలు తిరగబడటం ఖాయం. ఇది చివరకు పెద్ద ప్రజా ఉద్యమానికి దారితీస్తుంది" అని హెచ్చరించారు. ముందుగా దేశవ్యాప్తంగా జనగణన, కులగణన పూర్తి చేయాలి. 2027 మార్చి నాటికి ఈ ప్రక్రియ ముగిశాకే డీలిమిటేషన్‌పై ఆలోచించాలి. కేవలం జనాభానే కాకుండా ఆర్థికాభివృద్ధి, జీడీపీ (+ట్యా), కుటుంబ నియంత్రణ పాటిస్తున్న తీరును బట్టి ఎంపీ సీట్ల పెంపు ఉండాలి. ఈ వివక్షపై 'ఇండియా' కూటమిలోని భాగస్వామ్య పక్షాలతో చర్చించి ఉమ్మడి పోరాటం చేస్తాం.

**బీజేపీకి హెచ్చరిక..**

గతంలో రైతుల చట్టాల విషయంలో ఎలాగైతే వెనక్కి తగ్గారో, మొండిగా వెళ్తే డీలిమిటేషన్ విషయంలోనూ బీజేపీకి అదే గతి పడుతుంది. తెలంగాణలో ఐదు నెలల్లోనే జనగణన, కులగణన పూర్తి చేసి తాము చిత్తశుద్ధిని చాటుకున్నామని, కేంద్రం కూడా అదే బాటలో నడవాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

# భాగ్యనగరంలో 'ప్రేమ' ముసుగులో మతం మార్పిడి దందా

- మొదటి పేజి తరువాయి

వంచన ఉదంతం నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రేమ పేరుతో వల వేయడం, ఆపై మతం మార్చుకోవాలంటూ తీవ్రస్థాయిలో వేధింపులకు గురిచేస్తున్న ఇద్దరు అన్నదమ్ముల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జమీర్, అతని తమ్ముడు మిరాజ్ కలిసి ఒక పక్కా ప్రణాళికతో అమాయక యువతులను ట్రాప్ చేస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ అన్నదమ్ములు ఇద్దరూ ఇప్పటివరకు సుమారు ఐదుగురు హిందూ యువతులను ప్రేమ పేరుతో నమ్మించి, వారి జీవితాలతో ఆడుకున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.నిందితుల్లో ఒకరైన జమీర్‌పై గతంలోనే పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదై ఉండటం గమనార్హం. ఒక మైనర్ బాలికను వేధించిన కేసులో జైలుకు వెళ్లి వచ్చినా, అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని పోలీసులు గుర్తించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత జమీర్ తన తమ్ముడు మిరాజ్‌తో కలిసి ఈ అరాచకాలను మరింత ముమ్మరం చేశాడు. తాజాగా మరో యువతిని తన ప్రేమ వలలో వేసుకున్న జమీర్, ఆమెను లొంగదీసుకున్న తర్వాత అసలు స్వరూపాన్ని బయటపెట్టాడు. సదరు యువతిపై అఘాయిత్యానికి పాల్పడటమే కాకుండా, ఆమెను తమ మతంలోకి మారాలని బలవంతం చేస్తూ తీవ్రమైన ఒత్తిడికి గురిచేశాడు. ఒకవేళ ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే ప్రాణాలు తీస్తామంటూ అన్నదమ్ములిద్దరూ కలిసి బాధితురాలిని బ్లాక్ మెయిలింగ్ చేసినట్లు సమాచారం.బాధితురాలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఈ అన్నదమ్ముల గుట్టు రట్టయింది. రంగంలోకి దిగిన పంజాగుట్ట పోలీసులు నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ అన్నదమ్ములు కేవలం ఇద్దరే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారా లేక వీరి వెనుక ఏదైనా పెద్ద ముఠా ఉందా అనే కోణంలో పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో, నిందితుల నుంచి ప్రాణహాని ఉన్న యువతులకు రక్షణ కల్పించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నగర నడిబొడ్డున మతం మార్పిడి లక్ష్యంగా జరుగుతున్న ఇటువంటి దాడులు స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి.

# దందా ఆపకపోతే ఈడీకి ఫిర్యాదు చేస్తాం

- మొదటి పేజి తరువాయి

విమర్శించారు. జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రీ అవినీతికి అడ్డా అన్నట్లు ఈ విభాగాన్ని తయారు చేశారని మండిపడ్డారు. హెచ్ఎండీఏ పరిధిలో రూ. 35 వేల కోట్ల రూపాయల విలువైన భూములను అమ్మేసి.. హైదరాబాద్ అభివృద్ధికి రూపాయి కూడా ఖర్చు చేయలేదని చెప్పారు. పైగా తన అవినీతిని మరింత పెంచుకునేందుకు ఈ ముఖ్యమంత్రి ఫ్యూచర్ సిటీ అంటూ హంగామా చేస్తున్నారన్నారు. హైడ్రా పేరుతో ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారులను హడలెత్తించటమే కాకుండా స్క్వేర్ ఫీట్‌కు 150 రూపాయలంటూ వారి వద్ద వసూలు చేస్తున్నారని విమర్శించారు. వెంటనే ఈ బ్లాక్ మెయిల్ దందా ఆపకపోతే ఈడీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

**కమీషన్ల కోసం కాళేశ్వరం మరమ్మతులు...**

కాళేశ్వరం ప్రాజెక్ట్ మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావటాన్ని స్వాగతిస్తున్నామని కవిత చెప్పారు. అయితే.. కమీషన్ల కక్కుర్తి కోసం కాకుండా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కాళేశ్వరం ఫెయిల్ అయ్యిందని చెప్పేందుకు ఎనిమిదిన్నర లక్షల ఎకరాల భూమిని ఎండబెట్టిన కర్ణాటక ప్రభుత్వం ఇది అని విమర్శించారు. కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం మరమ్మతులను ఈ ప్రభుత్వం చేపడుతున్నట్టుగా తాను భావిస్తున్నానని అన్నారు. కాళేశ్వరం ప్రయోజనాలను రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో బీజేపీ మోసపూరితంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. 2027 జన గణన తర్వాతనే మహిళా బిల్లు అమలు చేయాలని.. అదే విధంగా ఓబీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై బీసీ మహిళలంతా కూడా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. డ్రాఫ్ట్ బిల్లును పరిశీలిస్తామని.. అవసరమైతే ఢిల్లీకి కూడా వెళ్తామన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ తన గురించి పిచ్చి పిచ్చిగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ నెల 25న జరగనున్న పార్టీ ఆవిర్భావ సభ ఏర్పాట్ల పర్యవేక్షణకు 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. ఒక్కో కమిటీలో 30 మంది సభ్యులుంటారన్నారు. అదే విధంగా 500 మంది వాలంటీర్లు ఉంటారన్నారు.

# లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు.. కీలక వ్యాఖ్యలు చేసిన తెలంగాణ డీజీపీ

- మొదటి పేజి తరువాయి

వంటి కీలక నేతలు ఉండటం విశేషం. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, గత ఏడాదిన్నర కాలంలోనే మొత్తం 763 మంది మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి ప్రభుత్వానికి లొంగిపోయారని వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల కూంబింగ్ కార్యకలాపాలు ముమ్మరం కావడంతో, తమ రక్షణ కోసం మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారేనని, తెలంగాణకు చెందిన వారు కేవలం ఒక్కరే ఉన్నారని డీజీపీ స్పష్టం చేశారు. ఒకప్పుడు సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీల్లో తెలంగాణ వాసుల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండేదని, కానీ ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆయన వివరించారు. సెంట్రల్ కమిటీలో 11 మంది నుంచి ఇద్దరు, స్టేట్ కమిటీలో 24 మంది నుంచి కేవలం ఇద్దరు మాత్రమే మిగిలారని, వారు కూడా త్వరలోనే లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోయిన 42 మందికి పునరావాస ప్యాకేజీ కింద రూ. 1.93 కోట్ల నగదును అందజేయడంతో పాటు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారికి ప్రత్యేక ఆరోగ్య కార్డులను కూడా జారీ చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ పునరావాస అవకాశాలను అందిపుచ్చుకుని, అడవి బాట పట్టిన వారంతా తిరిగి రావాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే.. రూ.8 లక్షల కోట్ల అప్పు ఎందుకు?

- మొదటి పేజి తరువాయి

వల్ల ప్రస్తుతం రాష్ట్రం నెలకు సుమారు ?6,500 కోట్లు అసలు మరియు వడ్డీల రూపంలో చెల్లించాల్సి వస్తోందని, ఈ భారాన్ని మోయడం ప్రస్తుత ప్రభుత్వానికి సవాలుగా మారిందని పేర్కొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులు: పాలమూరు–రంగారెడ్డి వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని, కేవలం ?25,000 కోట్లు ఖర్చు చేసి 80% పనులు పూర్తయ్యాయని అబద్ధాలు చెబుతున్నారని హరీష్ రావుపై మండిపడ్డారు.

సంక్షేమ పథకాల అమలు: అప్పుల భారం ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను మరియు రైతు రుణమాఫీని అమలు చేయడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# యూపీలో పడవ బోల్తా... 10 మంది మృతి...

- మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలో పడవ అదుపుతప్పి నదిపై ఉన్న ఫ్లోటింగ్ పాంటూన్ వంతెన (పైపా బ్రిడ్జి)ను ఢీకొట్టింది. దీంతో పడవ ఒక్కసారిగా నీటిలో మునిగిపోయింది. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానిక గజ ఈతగాళ్లు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 14 మందిని కాపాడి ఆసుపత్రికి తరలించగా, 10 మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన వారి కోసం ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు యమునా నదిలో తీవ్రంగా గాలిస్తున్నాయి.ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలను వేగవంతం

చేయాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం యోగి అధికారులను ఆదేశించారు. స్థానిక యంత్రాంగం బాధితులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# నమాజ్ కోసం ఉగ్రవాదులపై దాడిని వాయిదా వేశాం..

భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఒక కీలక విషయాన్ని వెల్లడించారు. ఉగ్రవాద శిబిరంపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడి చేసేందుకు సిద్ధమైనప్పుడు, అక్కడ ఉగ్రవాదులు నమాజ్ చేస్తున్నారని తెలిసి దాడిని ఉద్దేశపూర్వకంగా వాయిదా వేసినట్లు తెలిపారు. సైనిక లక్ష్యాలతో పాటు మానవతా విలువలకు కూడా ప్రాధాన్యత ఇస్తామని చెప్పడానికి ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రిషభ్ షా హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఐఐఎంయూఎన్ వారి 'బిఫోర్ ఐ బికేమ్ మీ' అనే పాడ్‌కాస్ట్‌లో జనరల్ ద్వివేది మాట్లాడారు. "మేము ఆ లక్ష్యాలను ఎప్పుడైనా ధ్వంసం చేయవచ్చు. కానీ, అవతలి వైపు ఉగ్రవాద శిబిరంలో వారు నమాజ్ చేస్తున్న సమయంలో దాడి చేయకూడదని నిర్ణయించుకున్నాం. ఎందుకంటే అందరి దేవుడు ఒక్కడే. అందుకే వారు ప్రార్థనలో లేని సమయాన్ని ఎంచుకున్నాం" అని ద్వివేది వివరించారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత జీవితం, నాయకత్వ శైలి గురించి కూడా ఆయన పంచుకున్నారు. సైన్యంలో మహిళల చేరిక, పని వాతావరణం వంటి విషయాల్లో తన కుమార్తెలు మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. "వారు చెప్పే విషయాలను నేను చాలా సీరియస్‌గా తీసుకుంటాను. అవసరమైన

చోట వాటిని అమలు చేస్తాను. వారే నాకు ఈ మార్పులను ఎలా స్వీకరించాలో నేర్పారు" అని ఆయన అన్నారు. తన సైనిక్ స్కూల్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ రోజుల గురించి మాట్లాడుతూ, మార్కుల కన్నా వైఖరి, పరిస్థితులకు అనుగుణంగా మారగలగడమే ముఖ్యమని జనరల్ ద్వివేది అభిప్రాయపడ్డారు. "మార్కులు కేవలం చదువులోని ప్రతిభకు సూచిక మాత్రమే, అవి మీ వ్యక్తిత్వాన్ని నిర్ధారించలేవు" అని ఆయన వ్యాఖ్యానించారు. అత్యంత క్లిష్టమైన కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో నైతిక సందిగ్ధత ఎదురైనప్పుడు, ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడానికి భగవద్గీత, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలు ఎంతగానో సహాయపడతాయని జనరల్ ద్వివేది తెలిపారు.

# ఢిల్లీలో సీడబ్ల్యూసీ సమావేశం.. హాజరైన సీఎం రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీలోని ఇందిరా భవన్ లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరయ్యారు సీఎం రేవంత్ రెడ్డి. శుక్రవారం ( ఏప్రిల్ 10 ) మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ కీలక నేతలు హాజరయ్యారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. మహిళా రిజర్వేషన్ల అంశంపై కూడా ఈ సమావేశంలో చర్చినట్లు సమాచారం. ఏప్రిల్ 16 నుంచి 18 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఉన్న క్రమంలో సీడబ్ల్యూసీ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అంశంపై పార్లమెంటులో చర్చించి చట్టసవరణ చేసేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తోంది కేంద్రం. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన విధానాలు, పార్టీ లైన్ పై సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

# పెన్ పవర్



## తెలంగాణ రౌండప్




నిజాంపేట్ సర్కిల్-58 పరిధి బాచుపల్లిలో హైవేకు భారీ అక్రమ నిర్మాణం.. చెరువు వైపు..

# పంచాయతీ పర్మిషన్ పేరుతో..!
# మున్సిపల్ చట్టాలకు తిలోదకాలు..!

- నాడు పంచాయతీ పర్మిషన్‌తోనే అక్రమ సెల్లార్ 'జీ+2' నిర్మాణం..!
- నేడు మున్సిపల్ అనుమతి లేకుండానే అదనపు అంతస్తుల 'జీ+5' కమర్షియల్..!
- ఎనిమిదేళ్ళ క్రితమే లేక్ఐడి నెం.2821 'బైరోని చెరువు' బఫర్‌లో ఈ నిర్మాణం..?

- నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లిలో రహదారిపైనే కమర్షియల్ అక్రమ నిర్మాణం..
- గండిమైసమ్మ-మియాపూర్ 200 ఫీట్ల రహదారిలో కమర్షియల్ కాంప్లెక్స్..
- పాత గ్రామపంచాయతీ నిర్మాణంపై.. కొత్తగా అదనపు అంతస్తులు..!
- నిర్మాణం పూర్తయ్యే వరకు చోద్యం చూస్తున్న నిజాంపేట్ సర్కిల్ 'సిఎంసి'..
- అనుమతి లేని అంతస్తులు- అధికారుల మౌనం వెనుక ముడుపులే కారణమా..?

మాధవ్ పత్తి..
మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 10:

టౌన్‌ప్లానింగ్ వ్యవస్థలో అక్రమ నిర్మాణాల దందాను, ఏ ప్రభుత్వాలు నియంత్రించలేక పోతున్నారన్న విమర్శలు తలెత్తుతుండగా..! నాడు మున్సిపల్- జీహెచ్ఎంసి హయాంలోనూ..! నేడు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యవస్థలోనూ..!టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరులో మార్పు కనిపించడం లేదని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.. మరోవైపు అక్రమ కట్టడాల వ్యవహారంలో, ప్రత్యేక 'పంథాను' అనుసరిస్తున్న ఎంచుకున్నట్టు విమర్శలు వస్తున్నాయి.. "నోటీసులు-సీజింగ్‌లు" అప్పుడప్పుడు మొక్కుబడి కూల్చివేతలు.. ఇవన్నీ 'టిజి-బిపాస్'- బిల్డ్‌నవ్ ప్రకారం చట్టపరమైన చర్యలే అయినప్పటికీ..! అక్రమ నిర్మాణంలో మాత్రం మార్పులు ఉండవు.. కారణం ఇదంతా 'అధికారులకు- అక్రమార్కుల'కు ఉన్న ఒప్పందంలో భాగమేనని పలువురి ఆరోపణలు వినవస్తున్నాయి..

-4లో

# టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్... పెరిగిన కరవు భత్యం

- తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ పెంపు
- 50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరిన కరవు భత్యం
- జనవరి 2026 నుంచి అమల్లోకి రానున్న పెంపు
- సంస్థపై నెలకు రూ.2.82 కోట్ల అదనపు ఆర్థిక భారం
- 38 వేల మందికి పైగా సిబ్బందికి ప్రయోజనం




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగుల కరవు భత్యం (డీఏ) 2.1 శాతం పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారికంగా ప్రకటించారు. తాజా పెంపుతో ఆర్టీసీ ఉద్యోగుల డీఏ 50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరింది. ఈ నిర్ణయంతో సుమారు 38 వేల మందికి పైగా ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి చేకూరనుంది.డీఏ పెంపు నిర్ణయం 2026 జనవరి నుంచే అమల్లోకి వస్తుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల బకాయిలను రాబోయే నెలల్లో సప్లిమెంటరీ బిల్లుల ద్వారా విడతలవారీగా చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ డీఏ పెంపు వల్ల ఆర్టీసీపై ప్రతి నెలా అదనంగా రూ. 2.82 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

-5లో

# టెక్నాలజీ వినియోగంతో పెరుగుతున్న ఆదాయం

## మంత్రివర్గ ఉపసంఘం సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏఐ వంటి ఆధునిక టెక్నాలజీ వినియోగం, సమీక్షలు, పకడ్బందీ నిఘా, నిర్వహణతో వివిధ శాఖల్లో ఆదాయం పెరుగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఆదాయ వనరుల పెంపుపై మంత్రివర్గ ఉపసంఘ సమావేశం జరిగింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులు పాల్గొన్నారు. ఏఐ టెక్నాలజీ వినియోగంతో మైనింగ్, రవాణాశాఖల్లో ఆదాయ వనరులను పెంచుకోగలిగామని ఈ సందర్భంగా భట్టి తెలిపారు. ఇసుక, క్రషర్ మైనింగ్ విభాగాల్లో అక్రమ రవాణా, ఓవర్‌లోడ్ వంటి అంశాల్లో చర్యలు చేపడితే ఆదాయం పెరుగుతుందని వివరించారు. నిరంతర సమీక్షలు, చర్యల మూలంగా జీఎస్టీ వసూళ్లు, రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయంలో వృద్ధి కనిపించిందని అన్నారు. ఆదాయం పెంచుకునే మార్గాలపై అధ్యయనం కోసం ప్రతి శుక్రవారం మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిర్వహిస్తామన్నారు. భూముల విలువ పెంపునకు సంబంధించి రిజిస్ట్రేషన్‌శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ కమిటీలు అధ్యయనం చేసి, ఇచ్చిన సిఫార్సుల మేరకు చర్యలు తీసుకోవాలని భట్టి అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ జీఎస్టీ వసూళ్లలో 15 శాతం వృద్ధి నమోదైనందున అది స్థిరంగా కొనసాగేలా చూడాలని సూచించారు. కొన్ని శాఖల్లో ఆదాయం పెరుగుతుంటే, కొన్నింటిలో తగ్గుతోందని, మరికొన్నింటిలో మార్పులేకుండా స్తబ్దత ఎందుకు ఉంటోందని, దీనిపై నిపుణులైన ఆర్థికవేత్తలతో అధ్యయనం చేయించాలని ఆయన ఆదేశించారు. భూముల విక్రయంపై ప్రపంచానికంతటికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని, దాంతో వేలంలో మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని ఉత్తమ్ సూచించారు. మెట్రో రైల్ స్వాధీనం, ఎక్సైజ్, రెవెన్యూ, పరిశ్రమల శాఖల్లో ఆదాయం పెంపునకు చేపట్టిన చర్యల ఫలితాలపై మంత్రులు సమీక్షించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# భారాసకు మమ్మల్ని విమర్శించే హక్కు లేదు



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, తమను విమర్శించే హక్కు భారాసకు లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టంచేశారు. శుక్రవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... "పెద్ద రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచేలా సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నాం. ఆర్థిక పరిస్థితి సరిగాలేకున్నా, ఎన్నికల సమయంలో రైతులకిచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి రూ. 2 లక్షల లోపున్న పంట రుణాల్ని మాఫీచేశాం. కొన్ని ఖాతాల్లో లోపాలుంటే సరిచేయడానికి అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హత ఉన్న ప్రతిరైతుకూ రుణమాఫీ ప్రయోజనం అందేలా కృషి చేశారు. అధికారంలో ఉన్న పదేళ్లపాటు రైతులను నిర్లక్ష్యం చేసిన భారాస ఇప్పుడు వారిపై కపట ప్రేమ చూపుతోంది" అని విమర్శించారు.

# పంచాయతీ పర్మిషన్ పేరుతో..!
# మున్సిపల్ చట్టాలకు తిలోదకాలు..!

- నాడు పంచాయతీ పర్మిషన్‌తోనే అక్రమ సెల్లార్ 'జీ+2' నిర్మాణం..!
- నేడు మున్సిపల్ అనుమతి లేకుండానే అదనపు అంతస్తుల 'జీ+5' కమర్షియల్..!
- ఎనిమిదేళ్ళ క్రితమే లేక్ఐడి నెం.2821 'బైరోని చెరువు' బఫర్‌లో ఈ నిర్మాణం..?




నిజాంపేట్ సర్కిల్-58 పరిధి బాచుపల్లిలో హైవేకు భారీ అక్రమ నిర్మాణం.. చెరువు వైపు..

- నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లిలో రహదారిపైనే కమర్షియల్ అక్రమ నిర్మాణం..
- గండిమైసమ్మ-మియాపూర్ 200 ఫీట్ల రహదారిలో కమర్షియల్ కాంప్లెక్స్..
- పాత గ్రామపంచాయతీ నిర్మాణంపై.. కొత్తగా అదనపు అంతస్తులు..!
- నిర్మాణం పూర్తయ్యే వరకు చోద్యం చూస్తున్న నిజాంపేట్ సర్కిల్ 'సిఎంసి'..
- అనుమతి లేని అంతస్తులు- అధికారుల మౌనం వెనుక ముడుపులే కారణమా..?

మాధవ్ పత్తి..
మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 10:


టౌన్‌ప్లానింగ్ వ్యవస్థలో అక్రమ నిర్మాణాల దందాను, ఏ ప్రభుత్వాలు నియంత్రించలేక పోతున్నారన్న విమర్శలు తలెత్తుతుండగా..! నాడు మున్సిపల్- జీహెచ్ఎంసి హయాంలోనూ..! నేడు సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ వ్యవస్థలోనూ..!టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరులో మార్పు కనిపించడం లేదని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.. మరోవైపు అక్రమ కట్టడాల వ్యవహారంలో, ప్రత్యేక 'పంథాను' అనుసరిస్తున్న ఎంచుకున్నట్టు విమర్శలు వస్తున్నాయి.. "నోటీసులు-సీజింగ్‌లు" అప్పుడప్పుడు మొక్కుబడి కూల్చివేతలు.. ఇవన్నీ 'టిజి-బిపాస్'- బిల్డ్‌నవ్ ప్రకారం చట్టపరమైన చర్యలే అయినప్పటికీ..! అక్రమ నిర్మాణంలో మాత్రం మార్పులు ఉండవు.. కారణం ఇదంతా 'అధికారులకు-అక్రమార్కుల'కు ఉన్న ఒప్పందంలో భాగమేనని పలువురి ఆరోపణలు వినవస్తున్నాయి..




సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట్ సర్కిల్-58లో టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై ప్రజలు సర్వత్రా విమర్శలు చేస్తున్నారు.. బాచుపల్లి గ్రామ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో ఎలాంటి అనుమతుల్లేని బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలపై గురువారం 'పెన్ పవర్' దినపత్రికలో ప్రచురించినది తెలిసిందే..! అందుకు నోటీసులు జారీచేశామని, త్వరలో చర్యలు తీసుకుంటామని టౌన్‌ప్లానింగ్ అధికారులు చెపుతున్నారు.. ఇదిలా ఉండగా తాజాగా బాచుపల్లిలో 200 ఫీట్ల వెడల్పుతో నిర్మిస్తున్న రహదారిపై, ఓ భారీ అక్రమ నిర్మాణం వ్యవహారంలో టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం బట్టబయలు చేస్తుంది.. దాదాపు ఎనిమిదేళ్ల క్రితం గ్రామపంచాయతీ నుంచి కేవలం 'జీం2' రెసిడెన్షియల్ భవనం నిర్మాణానికి అనుమతి తీసుకున్న ఓ నిర్మాణ దారుడు అప్పట్లోనే, అక్రమ సెల్లార్‌తో పాటు నిర్మాణం కూడా పూర్తి చేశాడు.. ఎనిమిదేళ్ళ తర్వాత ప్రస్తుతం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట్ సర్కిల్‌గా ఏర్పడింది..

## నాటి పంచాయతీ పర్మిషన్‌తోనే..! కమర్షియల్ కాంప్లెక్స్..!


చెప్పేవాళ్లు ఏం చెప్పినా..! వినేవాళ్ళైనా వివరవంతులు అయితే బాగుంటుంది.. ఈ సామెత నిజాంపేట్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు సరిగ్గా సరిపోతుందని పలువురు ఆరోపిస్తున్నారు.. నిత్యం ఫీల్డ్‌లో తిరిగి ఎప్పటికప్పుడు అక్రమ కట్టడాల జాబితాను, అధికారులకు అందజేసే చైన్‌మెన్‌లు ఉన్నారు.. ఒక అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్, కూడా ఉన్నప్పటికీ అక్రమ కట్టడాలు నిరాటంకంగా కొనసాగటం గమనార్హం.. ఎనిమిదేళ్ళ క్రితం పంచాయతీ పర్మిషన్‌తో నిర్మించిన పాత నిర్మాణంపైన, ప్రస్తుతం అదే పంచాయతీ అనుమతులను చూపిస్తూ 'జీం5' అంతస్తుల భారీ కమర్షియల్ భవనాన్ని నిర్మించడం పలు అనుమానాలకు తావిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. స్థానికుల ప్రకారం, ఈ నిర్మాణం బాచుపల్లి "లేక్ఐడి నెం.2821" పెద్ద చెరువు (బైరోని చెరువు) బఫర్ జోన్‌లో జరుగుతుందని ఆరోపిస్తున్నారు.. చెరువుల పరిరక్షణకు ఉన్న, కఠినమైన చట్టాలను కూడా బహిరంగంగా ఉల్లంఘిస్తున్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి..




## మున్సిపల్ చట్టాలకు తిలోదకాలు..

బాచుపల్లిలో ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న ఈ కమర్షియల్ నిర్మాణం, బైరోని చెరువు ఎఫ్‌టిఎల్-బఫర్ జోన్‌లో ఉన్నట్టు, హెచ్ఎండిఏ లేక్స్ వెబ్‌సైట్‌లో అధికారికంగా ఉంచిన 'కెడస్ట్రల్' మ్యాప్‌లో స్పష్టంగా కనిపిస్తుంది.. మరోవైపు ఎనిమిదేళ్ళ క్రితమే తీసుకున్న గ్రామపంచాయతి అనుమతులతో అప్పట్లోనే 'జీం2' నిర్మించారు.. అక్రమంగా సెల్లార్ కూడా ఉంది.. ప్రస్తుతం హైవే నిర్మాణం తోపాటు, నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి అభివృద్ధి చెందింది.. పాత నిర్మాణం నిబంధనలు ఉల్లంఘించి, అక్రమ సెల్లార్‌తో పాటు, చెరువులో ఉన్నట్టు తెలుస్తోంది.. దీనికి తోడు కొత్తగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి పర్మిషన్ కూడా తీసుకోలేదు.. అనుమతుల గురించి ప్రశ్నిస్తే, ఎనిమిదేళ్ళ నాటి పంచాయతీ పర్మిషన్ పేరుతో..! అదనపు అంతస్తుల కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణంగా తుది మెరుగులు దిద్దుకుంటుంది..

ఈ భారీ కమర్షియల్ నిర్మాణానికి గత మున్సిపల్ కార్పొరేషన్ నుంచి గానీ, ప్రస్తుత సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి గానీ ఎలాంటి అనుమతులు లేవని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ, దాదాపు 200 ఫీట్ల రహదారిపై బహిరంగంగా నిర్మాణం కొనసాగుతుండటం టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పుకుంటున్నారు.. ఇంత పెద్ద స్థాయిలో అక్రమ నిర్మాణం జరుగుతుంటే అధికారులు చూడలేదా..? లేక చూడనట్టే నటిస్తున్నారా..? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.. అధికారుల మౌనం వెనుక ముడుపుల వ్యవహారం ఉందేమోనని కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.. కనీసం అనుమతులు ఉన్నాయో, లేవో పరిశీలించే సమయం కూడా లేదా..! అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి..




బాచుపల్లి బైరోని చెరువు (లేక్ఐడి నెం. 2821) కెడస్ట్రల్ మ్యాప్..

# తెలంగాణలో ఒంటరి పోరే




హైదరాబాద్, ఏప్రిల్ 10, పెన్ పవర్: తెలంగాణలో బీజేపీ ఇక ఒంటరిపోరుకే సిద్ధమవుతుంది. ఎటువంటి పొత్తులకు సిద్ధపడకూడదని నిర్ణయించినట్లు కనపడుతుంది. రానున్న కాలంలో టీడీపీ, జనసేనతో పొత్తు పెట్టుకుంటుందన్న ప్రచారాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు బహిరంగంగానే ఖండించారు. ఆ పొత్తు వల్ల ప్రమాదమే కాని... ప్రయోజనం లేదని తెలంగాణ బీజేపీ నేతలు ఫిక్స్ అయినట్లుంది. మొన్నటి మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను ప్రచారానికి రావాలని ఆహ్వానించిన నేతలు తర్వాత మాత్రం ఆ ఆలోచనను విరమించుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ఎవరితో పొత్తు ఉండదని ప్రకటించారు. దీని వెనకకూడా అదే కారణమని అంటున్నారు. టీడీపీ, జనసేనలకు ఆంధ్రాపార్టీలుగా ముద్ర పడింది. ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ,జనసేన, బీజేపీలు పొత్తులో ఉన్నాయి. అయితే తెలంగాణకు వచ్చే సరికి ఆ పొత్తు పనిచేయదు. కూటమి వికటిస్తుంది. సెంటిమెంట్ అంటుకుంటే అసలుకే మోసం వస్తుంది. అందుకే ఏఎన్నికల్లోనూ టీడీపీ,జనసేనలతో నేరుగా పొత్తు పెట్టుకోకూడదని రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. ఇదే అభిప్రాయం కేంద్ర నాయకత్వంలోనూ ఉంది.తెలంగాణలో బీజేపీ ఒంటరిగా ఎదుగుతుంది. ఇప్పటికే గతం కంటే బలంగాతయా రయింది. అలాంటి సమయంలో అనవసరపు పొత్తులకు వెళ్లి పార్టీని ప్రజల్లో పలుచన చేయకూడదని భావిస్తున్నారు. ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి రావడం పెద్ద కష్టమేమీ కాదని, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల నుంచి అసెంబ్లీ ఎన్నికల వరకూ ఇదే సూత్రాన్ని పాటించాలని రాష్ట్ర నాయకత్వం కేంద్ర నాయకత్వానికి తెలియజెప్పిందని, అందుకు హైకమాండ్ కూడా అంగీకరించిందంటున్నారు. మరొకవైపు టీడీపీ, జనసేన ఓటు బ్యాంకు తమకు టర్న్ అయ్యే అవకాశం కూడా లేదని, పొత్తు పెట్టుకుంటే ఆ ఓట్లు పడకపోగా, పడే ఓట్లు కూడా రావన్నది పార్టీ నేతల అంచనాగా ఉంది.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వివాహిత అదృశ్యం.. కేసు నమోదు





గార్ల పెన్ పవర్ ఏప్రిల్ 10: గార్ల మండల పరిధిలోని చవిటి తండా గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు గార్ల ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చవిటి తండా గ్రామానికి చెందిన బానోత్ సంగీత (19) వృత్తిరీత్యా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈనెల 5వ తారీకు ఆదివారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుండి బయటికి వెళ్లిపోయింది దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో సంగీత భర్త బానోతు లోకేష్ ఫోన్ ద్వారా పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వగా వెంటనే ఫిర్యాదు ఇంటికి వెళ్లి అతని వద్ద నుండి దరఖాస్తు తీసుకొని మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## తుమ్మలపల్లిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

వైరా, ఏప్రిల్ 10 పెన్ పవర్: తుమ్మలపల్లి గ్రామంలో స్థానిక నాయకులు కమతం నాగేశ్వరరావు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతుల ఇబ్బందులు తొలగించి, కొనుగోలు ప్రక్రియను, తూకం, సాంకేతిక సమస్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలో రైతుల ఇతర సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తున్నారు. "రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుంది" అనే నినాదంతో గ్రామాభివృద్ధికి ఆయన నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు.

## కాంగ్రెస్ నాయకుల పరామర్శ, సంతాపం తెలిపిన దీపక్ చౌదరి

మధిర, ఏప్రిల్ 10 పెన్ పవర్: ఖమ్మం జిల్లాలో, కాంగ్రెస్ కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ఆరో డివిజన్లో పలువురిని పరామర్శించి సంతాపం తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు లింగ బోయిన వెంకటేశ్వర్లు గారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రశాంత్ నగర్ రోడ్ నెంబర్ 4 లో తుమ్మల లాలయ్య కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆరో డివిజన్ అధ్యక్షులు ఎడవల్లి వీరయ్య గౌడ్, చంద్ర శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంఘటనలు ఖమ్మం జిల్లాలో జరిగాయి.

## అరైవ్ , అలైవ్, పకడ్బందీగా నిర్వహించాలి

పాలేరు, ఏప్రిల్ 10 పెన్ పవర్: మణుగూరులో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్, అలైవ్ కార్యక్రమాన్ని ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ సురేష్ తెలిపారు. శుక్రవారం సంబంధిత శాఖ అధికారులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. రోడ్డు భద్రతే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తాసిల్దార్ నరేష్, సిఐ నాగబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.

## టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్... పెరిగిన కరవు భత్యం

-3 పేజి తరువాయి

తమ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పునరుద్ఘాటించారు.సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగులకు ఏటా జనవరి, జులై నెలల్లో డీఏను సవరిస్తారు. గత ఏడాది జులైలో కూడా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం 2.1 శాతం డీఏ పెంచింది. తాజాగా మరోసారి డీఏను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.
ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం ఆర్టీసీకి ఆర్థికంగా ఊతమిస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగి, సంస్థ ఆదాయం వృద్ధి చెందింది. గత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నాటికి ఆర్టీసీ సుమారు రూ.954 కోట్ల నిర్వహణ లాభాన్ని ఆర్జించింది. మహాలక్ష్మి పథకానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి చెల్లిస్తుండటంతో సంస్థ కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో కొత్త బస్సులను కొనుగోలు చేసి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా లాభాలను మరింత పెంచుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు రచిస్తోంది.

# తెలంగాణలో 2 లక్షల రేషన్ కార్డుల రద్దు

హైదరాబాద్, ఏప్రిల్ 10, పెన్ పవర్:
రాష్ట్రంలో రేషన్ కార్డుల అనర్హుల జాబితాను గుర్తించే పనిలో అధికారులు పడ్డారు. విజిలెన్స్ అధికారులు రహస్యంగా ఆడిట్ నిర్వహించగా.. భారీగా అవకతవకలు ఉన్నట్లు తేలింది. దీంతో ఆ రేషన్ కార్డులను రద్దు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. అంతేకాకుండా రేషన్ కార్డు ద్వారా ఇప్పటివరకు పొందిన సబ్సిడీని కూడా రికవరీ చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఇప్పుడు రేషన్‌కార్డుదారుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.తెలంగాణలో అనర్హులకు 1.40 లక్షల రేషన్ కార్డులను రద్దు చేసినట్లు ఇటీవలె కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బాంభానియా పార్లమెంటుకు చెప్పిన సంగతి తెలిసిందే. మరోవైపు రేవంత్ రెడ్డి సర్కార్ కూడా అనర్హులు కలిగి ఉన్న రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియను ముమ్మరంగా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే తెలంగాణ విజిలెన్స్ విభాగం.. గుట్టు చప్పుడు కాకుండా.. రేషన్ కార్డులకు సంబంధించి రహస్య ఆడిట్ నిర్వహించగా అందులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్‌లోనే ఏకంగా 2 లక్షల మంది అనర్హులు రేషన్ కార్డులు కలిగి ఉన్నారని తేలింది.పాన్ కార్డు, గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) నంబర్లను రేషన్ కార్డు డేటాతో విజిలెన్స్ అధికారులు లింక్ చేయగా.. కీలక విషయాలు బయటపడినట్లు తెలుస్తోంది. ఒక్క హైదరాబాద్ నగరంలోనే దాదాపు 2 లక్షల మంది ఆదాయపు పన్ను (ఇన్‌కం ట్యాక్స్) చెల్లించే వారు రేషన్ కార్డులను పొందినట్లు వెల్లడైంది. దీనికి సంబంధించి ఇప్పటికే 80 శాతం వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఐటీ పన్ను చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగుల రేషన్ కార్డులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాఫ్ట్‌వేర్‌తో విజిలెన్స్ అధికారులు గుర్తించడం గమనార్హం.మరోవైపు.. అనర్హులుగా తేలిన వారి రేషన్ కార్డులను రద్దు చేయడంపై ఇప్పుడు అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే కేవలం రేషన్ కార్డులను రద్దు చేయడం మాత్రమే కాకుండా వారు పొందిన సబ్సిడీని కూడా తిరిగి వసూలు చేసేలా చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు కూడా రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు రేషన్ కార్డులు పొందిన అనర్హుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత భారీగా రేషన్ కార్డులను జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోల్చితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో 15 లక్షల కంటే ఎక్కువ రేషన్ కార్డులు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవలె గణాంకాలు విడుదల చేసింది. ప్రస్తుతం తెలంగాణలో 17,348 రేషన్ దుకాణాలు ఉండగా.. వాటి నుంచి నెలకు 1.05 కోట్ల రేషన్ కార్డు దారులకు సరుకులు తీసుకుంటున్నట్లు కేంద్రం తెలిపింది. వీటిలో 99,36,073 ఫుడ్ సెక్యూరిటీ కార్డులు కాగా.. మరో 5,66,660 అంత్యోదయ అన్న యోజన కార్డులు ఉన్నాయని పేర్కొంది. 5146 అన్నపూర్ణ కార్డులు కూడా ఉన్నట్లు కేంద్రం స్పష్టం చేసింది



# కేసీఆర్ వెంట... రెండు సార్లు కేసీఆర్ పై పోటీ..



హైదరాబాద్, ఏప్రిల్ 10, పెన్ పవర్: తెలంగాణ రాజకీయాల్లో జీవన్ రెడ్డిది ఓ ప్రత్యేక శైలి. 1983లో మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచినా ఇంకా సొంత నియోజకవర్గానికి మాత్రమే అంటిపెట్టుకుని ఉన్న అరుదైన నేత. అంతే కాదు ఏ కేసీఆర్‌పై రెండు సార్లు పోటీ చేసారో ఇప్పుడు అదే కేసీఆర్ పార్టీలోకి వెళుతుండటం ఆసక్తికర పరిణామం. ఒకప్పుడు ఎవరినైతే ఓడించడానికి తన సర్వశక్తులూ ఒడ్డారో, నేడు అదే నాయకుడి వెనుక నడవడానికి సిద్ధపడ్డారు. జగిత్యాల ప్రజల తలలో నాలుకగా మెదిలి, కాంగ్రెస్ కోటను కాపాడిన తాటిపర్తి జీవన్ రెడ్డి, నేడు గులాబీ కండువా కప్పుకోవడం వెనుక రాజకీయ అవసరాలకు మించిన ఆత్మగౌరవం, అసంతృప్తి దాగి ఉన్నాయి.తెలుగు రాష్ట్రాల రాజకీయాలు తెలిసిన ఎవరికైనా జీవన్ రెడ్డి పేరు సుపరిచితం. నేటి దిగ్గజనేతలు కేసీఆర్, చంద్రబాబు సమకాలికుడే కాదు, 1983లోనే ఎమ్మెల్యే.. యువ మంత్రి, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పలు పర్యాయాలు ఓడిపోయినప్పటికీ కాంగ్రెస్ గడ్డుకాలంలో చాలా సందర్భాల్లో జీవన్ రెడ్డి గెలిచి తన ప్రత్యేకత చాటుకున్నారు. అంతే కాదు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న వేళ కేసీఆర్ సెంటిమెంటును కొనసాగించేందుకు రాజీనామాలు, ఉపఎన్నికల ఎత్తుగడలు వేసేవారు అలా 2006, 2008 కరీంనగర్ లోక్‌సభ ఉపఎన్నికల్లో కేసీఆర్ పై కాంగ్రెస్ తరఫున పోటీకి నిలిచారు. మొదటిసారి రెండు లక్షల ఓట్లతో కేసీఆర్ గెలిచినా.. 2008లో మాత్రం వైఎస్ సహకారంతో జీవన్ రెడ్డి కేసీఆర్ కు ముచ్చెమటలు పట్టించారు. కరీంనగర్ లో తనకు ఎదురు లేదనుకున్న గులాబీ నేతను దాదాపు ఓటమి అంచులదాకా నెట్టి కేవలం 15వేల మెజారిటీ మాత్రమే ఇచ్చారు. కానీ, కాలక్రమేణా పరిస్థితులు మారాయి. నేడు అదే కేసీఆర్ నాయకత్వాన్ని కీర్తిస్తూ, "ప్రజలు కోరిన దానికంటే ఎక్కువే చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్" అని జీవన్ రెడ్డి కీర్తించే దాకా పరిణామాలు మారాయి. శత్రువు నుంచి మిత్రుడిగా మారిన ఈ ప్రస్థానం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.జీవన్ రెడ్డి అంటే సంప్రదాయ రాజకీయ నాయకత్వానికి ఉదాహరణ. ఆయన ఇల్లు, ఆఫీసు చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. ఆధునిక కార్పొరేట్ రాజకీయాల హంగులు ఆయన దరిచేరలేదు. ఆయన ఆఫీసు డెస్కు దశాబ్దాల నాటి పాత శైలిలో ఉంటుంది. అత్యంత సాధారణంగా ఉండే ఆ గదిలోనే వేల మందిని ప్రతిరోజూ కలుస్తుంటారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసినా ఆయన జీవనశైలి మారలేదు. కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే 'ఓపెన్ డోర్' పాలసీ ఆయనది. గల్ఫ్ బాధితులైనా, స్థానిక పేదలైనా ఆయన వద్దకు వెళ్లి కష్టాలు తీర్చమని అడుగుతారు. ఇంటికి వచ్చిన వారికి పప్పు, పచ్చిపులుసు, మామిడికాయ తొక్కుతో 'సింపుల్ లంగర్' దశాబ్దాలుగా వడ్డిస్తున్నారు. వైఎస్ హయాంలో అత్యధిక సీఎం రిలీఫ్ ఫండ్ సాధించుకున్న నేత కూడా జీవన్ రెడ్డి గారే. కాంగ్రెస్ నాయకులకు ఢిల్లీ పర్యటనలు, 10 జనపథ్ అపాయింట్‌మెంట్ కోసం పడిగాపులు సర్వసాధారణం. కానీ, జీవన్ రెడ్డి శైలి వేరు. ఆయన ఎన్నడూ పదవుల కోసం ఢిల్లీ వీధుల్లో లాబీయింగ్ చేయలేదు. తనకు పదవి రావాలన్నా, పోవాలన్నా అది తన పనితీరు మీద ఆధారపడాలే తప్ప హైకమాండ్ ప్రదక్షిణల వల్ల కాదన్నది ఆయన నమ్మకం. తన నియోజకవర్గమే ఢిల్లీ, ప్రజలే హైకమాండ్ అన్నట్లుగా సాగుతారు. ఇప్పుడు రేవంత్ తో వైరం కూడా ఆ ఆత్మగౌరవ ప్రతిష్టతోనే వచ్చిందని చెబుతారు. 42 ఏళ్ల పాటు పార్టీతో నడిచి నేడు వీడటానికి జీవన్ రెడ్డి చెప్పిన కారణాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేశాయి. "తెలంగాణ ప్రజలు మార్పు కోసం ఆశపడి ఓటేశారు, కానీ నేడు నిరాశకు గురవుతున్నారు" అని ఆయన చేసిన విమర్శలు చాలా ఘాటైనవి. ఫిరాయింపుల రాజకీయాలను ప్రోత్సహించడం, సీనియర్లకు గౌరవం ఇవ్వకపోవడం వంటి అంశాలు ఆయన ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయి. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు 2014లో ఒంటరి పోరాటం చేసి గెలిచిన తనకు, నేడు సొంత పార్టీలోనే గుర్తింపు కరువైందన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జీవన్ రెడ్డిని కాంగ్రెస్ ఎప్పుడూ గౌరవించింది. 2018లో ఓడిపోతే ఎమ్మెల్సీని చేసింది. అంతకు ముందు కాంగ్రెస్ హయాంలో మంత్రిని చేసింది. మొత్తం 14 సార్లు జీవన్ రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. బుజ్జగించేందుకు జాతీయ నేతలు, పీసీసీ అధ్యక్షులతో సహ అందరూ ఆయన ఇంటికి వెళ్లి కాంగ్రెస్ లో కొనసాగాలని కోరారు. కేవలం ఒకరితో ఆభిజాత్యానికి పోయి తల్లిలాంటి పార్టీని వీడటం సరికాదని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ లాంటి కుటుంబ పార్టీలోకి వెళ్తే కేసీఆర్ ప్రేమలు ఎప్పటికీ ఉండవని హెచ్చరిస్తున్నారు.జగిత్యాల గడ్డపై తనకంటూ ఒక ముద్ర వేసుకున్న జీవన్ రెడ్డి, ఇప్పుడు కేసీఆర్ గూటికి చేరబోతున్న నేపథ్యంలో.. ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు మారతాయా. రాజకీయం అంటే కేవలం అధికారమే కాదు, ఆత్మగౌరవంతో కూడిన ప్రయాణం అని జీవన్ రెడ్డి చెప్పకనే చెబుతున్నారు. బిఆర్ఎస్‌లో ఆయన ప్రస్థానం ఎలా సాగుతుందో.. తన కోడలికి రాజకీయ వారసత్వం అప్పగించి వానప్రస్తంలోకి జారుకుంటారో చూడాలి!

# స్టీల్ బ్యాంక్... ప్లాస్టిక్ రహిత గ్రామంగా ఆదర్శం

నిజామాబాద్, ఏప్రిల్ 10, పెన్ పవర్: సోషల్ మీడియాను తెగ తిడుతుంటాం. అందర్నీ పాడు చేస్తోందని. కానీ కోవిడ్ లాంటి సమయాల్లో, లేదా క్లిష్టమైన సమయాల్లో సోషల్ మీడియానే ప్రముఖ పాత్ర పోషించింది. అనేక ముఖ్యమైన సమాచారాలు, ఆరోగ్య సమాచారాలు, ఇతరులకు సేవ చేసే విషయాలు ఈ వేదిక ద్వారానే ప్రపంచానికి తెలిసాయి.అంతేకాకుండా చాలా మంచి మంచి విషయాలను కూడా సోషల్ మీడియా సమాజం ముందుకు తెస్తుంది. దీంతో సమాజానికి చాలా మేలు చేకూరుతుంది. తాజాగా ఇలాంటి ఓ వార్తే సోషల్ మీడియాలో వచ్చింది. దీంతో ఊరు ఊరంతా మారిపోయింది. పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించింది ఆ గ్రామం. గ్రామంలో ఇంతటి మార్పుకు కారణమైంది మన సోషల్ మీడియానే. ఇదంతా జరిగింది బాసర సమీపంలోని గుండంపల్లి గ్రామం.ఈ రోజుల్లో ప్రతిదీ ప్లాస్టిక్ అయ్యింది. దీంతో కాన్సర్ కి కారణం అవుతోంది. ఏ ఫంక్షన్ జరిగినా, చిన్న కార్యక్రమం జరిగినా.. ప్రయాస పడకూడదని ప్లాస్టిక్ విస్తళ్లు, ప్లాస్టిక్ గ్లాసులను ఆర్డర్ ఇచ్చేస్తున్నారు. వాడేస్తున్నారు, పాడేస్తున్నారు. దీంతో మనుషులకు కేన్సర్ లాంటి రోగాలు రావడంతో పాటు వాటిని తిన్న పశువులు కూడా తీవ్ర అనారోగ్యానికి బలి అవుతున్నాయి.ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న గుండంపల్లి గ్రామస్థులు అలర్ట్ అయ్యారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 500 స్టీల్ ప్లేట్లు, గ్లాసులతో "స్టీల్ బ్యాంకు"ను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో జరిగే ప్రతి శుభకార్యంలోనూ వీటినే ఉపయోగిస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ వాడకం తగ్గింది. పర్యావరణ పరిరక్షణలో ఇదో కీలక అడుగుగా భావిస్తున్నారు. శుభ కార్యాల్లో ఇందులోనే తిని, వాటిని ప్రజలే శుభ్రం చేసి, తిరిగి ఇచ్చేస్తున్నారు.అలాగే అనుమతి లేకుండా తమ గ్రామంలో విక్రయిస్తున్న ఐస్ క్రీమ్ లపై కూడా అలర్ట్ అయ్యారు గ్రామస్థులు. వాటిని తమ గ్రామంలోకి అనుమతించ కూడదని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. గ్రామ సరిహద్దుల్లోనే ఇలాంటి వాటిని అడ్డుకుంటున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను వాడొద్దని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారుగుండంపల్లి గ్రామస్థులందరూ ఐకమత్యంతో స్టీల్ ప్లేట్ల వాడకం, పర్యావరణాన్ని కాపాడలన్న నిర్ణయం తీసుకోవడంతో రాష్ట్రానికి దిక్సూచిగా మారారు. వీరు తీసుకున్న నిర్ణయాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు. ఏ ప్రభుత్వ అధికారులు చెప్పకపోయినా, స్వచ్ఛందంగా, ప్రకృతిపై వున్న మమకారంతో, తమ ఆరోగ్యం విషయంలో తీసుకునే శ్రద్ధ కారణంగా, అవగాహన కారణంగా ఈ విజయం వరించింది. అలాగే ప్రతి ఇంటి నుంచి కూడా సహకారం లభించడంతో విజయం సాధించారు.ప్రజల్లో చైతన్యం పెరిగితే మార్పుదానంతట అదే వస్తుందని మరోసారి నిరూపితమైంది.ఒక గ్రామంలో 500 స్టీల్ ప్లేట్లు 20 కార్యక్రమాల్లో వాడితే... 10,000 ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగం తగ్గినట్టే. అదే ప్రతి గ్రామం చేస్తే... పర్యావరణానికిఎంత మేలు జరుగుతుందో ఊహించండి.

# యువకుడి ప్రాణం తీసిన ఈత సరదా





**ఖమ్మం, రూరల్ పెన్ పవర్, ఏప్రిల్ 10:** స్నేహితులతో సరదాగా ఈత కొట్టేందుకు సాగర్ కాలువలో దిగి పదో తరగతి చదువుతున్న ఓ బాలుడు ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఏదులాపురం మున్సిపాలిటీ ఏదులాపురం గ్రామానికి చెందిన పుట్టబంతి నాగయ్య ఆటో డ్రైవర్ గా జీవనం సాగిస్తున్నాడు. నాగయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు పుట్టబంతి రామకృష్ణ (16) ఏదులాపురం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పదో తరగతి ఇంకో పరీక్షలు రాయాల్సి ఉంది. శుక్రవారం తన స్నేహితుడి పుట్టిన రోజు ఉండటంతో అందరూ కలిసి సరదాగా మున్సిపాలిటీ మద్దులపల్లి సాగర్ కాలువలో ఈత కొట్టేందుకు వచ్చారు. రామకృష్ణతో పాటు మరో అయిదుగురు సాగర్ కాల్వలోకి దిగి ఒడ్డున ఈత కొడుతున్నారు. ఈ క్రమంలో రామకృష్ణ కొద్దిగా లోతుకు వెళ్లడంతో ఒక్కసారిగా మునిగిపోయాడు. మృతుని వెంట వచ్చిన స్నేహితులు ఎవరికీ ఈత రాకపోవడంతో రామకృష్ణను కాపాడలేకపోయారు. కొద్దిసేపట్లోనే రామకృష్ణ పూర్తిగా నీళ్లలో మునిగి గల్లంతయ్యాడు.

# జిపిఓపై దాడి అమానుషం



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 10:** రెవెన్యూ సిబ్బంది పై దాడి అమానుషమని తాసిల్దార్ శారదఅన్నారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండల జిపిఓపై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం నల్ల రిబ్బన్లు ధరించి మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. అనంతరం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ

రెవెన్యూ సిబ్బందిపై దాడి హేయమైన చర్యగా ఖండిస్తున్నామని రెవెన్యూ సిబ్బందిపై దాడులు ప్రభుత్వం అరికట్టాలని కోరారు.

ఇలాంటి ఘటనలు పురావృతం కాకుండా దాడి చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గులాబీలో అంతర్మధనం...

**హైదరాబాద్, ఏప్రిల్ 10, పెన్ పవర్:**
ముందు వచ్చిన చెవుల కంటే.. వెనుక వచ్చిన కొమ్ములు వాడి అంటారు. మిగతా రంగాలలో ఏమోగానీ.. రాజకీయాల్లో మాత్రం ఈ సామెత నూటికి నూరు శాతం సరిపోతుంది. అధికారంలోకి రాకముందు పార్టీలు మొత్తం ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడతాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం ఆ అధికారాన్ని మరింత సుస్థిరం చేసుకోవడానికి తాపత్రయపడతాయి. ఇందులో ఆ పార్టీ.. ఈ పార్టీ అని తేడా లేదు.. అన్ని అలానే ఉన్నాయి.తెలంగాణ రాష్ట్రంలో 2014లో జరిగిన ఎన్నికల్లో నాటి తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చింది.. అప్పుడు ఆ పార్టీకి గొప్పగా చెప్పుకునే సీట్లు రాలేదు. దీంతో ఆపరేషన్ ఆకర్ష్ కు తెరలేపింది. టిడిపి నుంచి మొదలు పెడితే కాంగ్రెస్ పార్టీ వరకు అందరూ ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుంది. చివరికి కమ్యూనిస్టు పార్టీని కూడా వదిలిపెట్టలేదు. నాడు ఈ పరిణామాన్ని గులాబీ పార్టీ రాజకీయ పునరేకీకరణ అని చెప్పింది. అంతేకాదు 2018 లో జరిగిన ఎన్నికల్లోను ఇతర పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుంది గులాబీ పార్టీ. పైగా వారికి మంత్రి పదవులు కూడా ఇచ్చింది.. నాడు కూడా కేసీఆర్ దానిని రాజకీయ పునరేకికరణ అని చెప్పారు.అప్పుడు ఇతర పార్టీలకు సంబంధించిన ఎమ్మెల్యేలు గులాబీ పార్టీలో చేరుతున్నప్పుడు.. రకరకాల విమర్శలు వచ్చాయి. నాడు అధికారం ఉంది కాబట్టి వాటిని కేసీఆర్ తొక్కిపెట్టారు. ఒరిజినల్ తెలంగాణ కాకుండా.. బంగారు తెలంగాణ బ్యాచ్ హవా పెరిగిపోయిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. అయినప్పటికీ వాటిని కెసిఆర్ పట్టించుకోలేదు. పైగా సొంత మీడియాలో రాజకీయ పునరేకీకరణ అనే కోణంలో కథనాలు రాయించారు. అప్పట్లో కెసిఆర్ మీడియా మీద ఉక్కు పాదం మోపడంతో.. తెలంగాణలో ప్రశ్నించే గొంతుక లేకుండా పోయింది.2023 లో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత గతంలో తనకు ఎదురైన అనుభవానికి గట్టి రివెంజ్ తీర్చుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావించారు.



అందులో భాగంగానే గులాబీ పార్టీలో గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. దీనిని బిఆర్ఎస్ నేతలు విమర్శించారు. సుప్రీంకోర్టు దాకా వెళ్లారు. అనేక సందర్భాల్లో విచారణ పూర్తయిన తర్వాత సుప్రీంకోర్టు ఈ అంశాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లింది. స్పీకర్ ఎలాగూ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వ్యక్తి కాబట్టి.. ఆ పార్టీకి అనుకూలంగానే నిర్ణయం తీసుకున్నారు. మొత్తంగా గులాబీ పార్టీ ఈ వ్యవహారంలో ఏదో చేయబోయి.. తనే విమర్శల పాలైంది.అటు కాంగ్రెస్ పార్టీ.. ఇటు భారత రాష్ట్ర సమితి ఇప్పుడు తెలంగాణలో ఒక రకమైన ఒత్తిడి వాతావరణాన్ని ఎదుర్కొంటున్నాయి.. భారత రాష్ట్ర సమితి జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని చేర్చుకుంది. ఇది ఎల్ రమణలాంటి వాళ్లకు నచ్చడం లేదు. పైగా వచ్చే ఎన్నికల్లో జీవన్ రెడ్డికి టికెట్ ఇస్తామని గులాబీ పార్టీ పెద్దలనుంచి హామీ లభించినట్లు తెలుస్తోంది. అదే జరిగితే రమణ రాజకీయ భవిష్యత్తు మొత్తం నాశనమైనట్టే. అందువల్లే ఆయన జీవన్ రెడ్డి రాక పట్ల అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. మిగతా భారత రాష్ట్ర సమితి నాయకులు కూడా ఇదే ధోరణిలో ఉన్నట్టు సమాచారం. ఒకవేళ జీవన్ రెడ్డి కి ఒక టికెట్ ఇస్తే.. రమణ తన రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వేరే నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు కనిపిస్తోంది. కేవలం జగిత్యాలలోనే కాకుండా.. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో భారత రాష్ట్ర సమితి ఆపరేషన్ ఆకర్ష కు తెర లేపినట్టు తెలుస్తోంది. అయితే అక్కడ ఉన్న గులాబీ పార్టీ నేతలు అంతర్మథనంలో పడుతున్నారని.. తమ రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా వేరే నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని వార్తలు వస్తున్నాయి.ఇక అధికార కాంగ్రెస్ పార్టీలో కూడా పరిస్థితి ఏమంత గొప్పగా లేదు. రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిని ఆశిస్తున్నారు. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ పార్టీని కడిగిపారేస్తున్నారు. ఎమ్మెల్సీ విజయశాంతి కూడా ప్రభుత్వ వైఖరి పట్ల తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. తన సేవలను పార్టీ వాడుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల శాసన మండలి లో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ వ్యవహార శైలి సక్రమంగా లేదని.. ప్రభుత్వంలో కూడా సానుకూల దృక్పథం కనిపించడం లేదని మండిపడ్డారు. ఇంకా కొంతమంది నేతలు కూడా ప్రభుత్వ తీరు పట్ల ఆగ్రహంతో ఉన్నారు. మొత్తంగా చూస్తే అటు బిటి బ్యాచ్.. ఇటు వలస బ్యాచ్.. వల్ల రెండు ప్రధాన పార్టీలు శిరోభారాన్ని ఎదుర్కొంటున్నాయి. అయితే ఈ భారం ఎంతవరకు సాగుతుంది.. వచ్చే ఎన్నికల్లో ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తుంది.. ఈ ప్రశ్నలకు త్వరలోనే సమాధానం లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## ఉచిత కూరగాయల విత్తనాల పంపిణీ: రైతుల ముఖాల్లో ఆనందం

**నకిరేకల్, ఏప్రిల్ 10 పెన్ పవర్:** నల్గొండ జిల్లా ఆర్టికల్చర్ ఆఫీసర్ అనంతరెడ్డి ఆధ్వర్యంలో, మాడుగులపల్లి మండలం కొత్తగూడెం గ్రామంలో ఉచిత కూరగాయల విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గడ్డం పద్మ ప్రభాకర్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ సింగం పరమేష్, మాజీ ఉపసర్పంచ్ సోమనాబోయిన నాగరాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డం శశిధర్ రెడ్డి, ఇతర రైతులు పాల్గొన్నారు. ఈ పంపిణీలో ఐదు రకాల విత్తనాలను రైతులకు అందించారు.

## పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కాంప్లెక్స్ హెచ్ఎం

**మునుగోడు, ఏప్రిల్ 10 పెన్ పవర్:** అనంతగిరి మండలం ఖానాపురం ప్రాథమికోన్నత పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీధర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో హెచ్ఎం సుశర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సుశీలమ్మకు సిపిఐ ఘనంగా శ్రద్ధాంజలి

**దేవరకొండ, ఏప్రిల్ 10 పెన్ పవర్:** సూర్యాపేట జిల్లా, చిలుకూరు మండల కేంద్రంలో మృతి చెందిన కస్తూరి సుశీలమ్మ (భర్త కొండయ్య) కు సీపీఐ చిలుకూరు గ్రామ శాఖ శుక్రవారం అంత్యక్రియల సందర్భంగా అరుణ పతాకాన్ని ఆమె భౌతికకాయంపై ఉంచి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించింది. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీనివాసరావు, కస్తూరి సైదులు, సత్యనారాయణ, వెంకటి, సాయబలీ, తుపాకీ, గంగాధర్, సిరాపురపు శ్రీను, చేపూరి కొండలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం




**ఖమ్మం, పెన్ పవర్, ఏప్రిల్ 10:** నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు
ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం వెంకట్రాంపురం గ్రామానికి చెందిన దేపంగి శ్రీకాంత్ వీరకుమారి దంపతుల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి మంత్రి వర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు అనంతరంఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.లబ్ధిదారులు కొత్త ఇంటిలో అడుగుపెడుతూ సంతోషం వ్యక్తం చేయగా, మంత్రి వారికి శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారుఈ కార్యక్రమంలో ఎదులాపురం మున్సిపల్ చైర్మన్ పోక బత్తిని అనిత,నేలపట్ల సర్పంచ్ శోభన్ బాబు, అగ్రహారం సర్పంచ్ మల్లెల స్వాతి ఉపేందర్,ఆత్మ కమిటీ డైరెక్టర్ రాణిరామరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానికులు పాల్గొన్నారు

## నెరవేరనున్నరెండు దశాబ్దాల కల



**ఖమ్మం, పెన్ పవర్, ఏప్రిల్10:** గత రెండు దశాబ్దాలు గా ఆటో నగర్ నుండి మద్దెలపల్లి మార్కెట్ వరకు నిత్యం రద్దిగా వుండే రోడ్ కనీస మరమ్మత్తులకు నోచుకోలేదు ఈ రోడ్ నుండి రాకపోకలుసాగించే వాహనదారుల పాదాచారుల కష్టాలు పట్టించుకునే వారు లేక ఇబ్బందులకి గురయ్యారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు. ప్రజా ప్రభుత్వం ఎన్నో అడ్డంకులు దాటుకొని ఆటోనగర్ నుండి మద్దులపల్లి మార్కెట్ వరకు రోడ్ నిర్మాణానికి రేపు శంకుస్థాపన చేయనుంది కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన మాట కొరకు పోరాడి అడ్డంకులు దాటుకొని 30 వ వార్డు ప్రజల కల నెరవేర్చటానికి చేసిన కష్టానికి ఫలితం దక్కనుంది నేడు రోడ్డు నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేతుల మీదగా శంకుస్థాప చేయనున్నారుప్రజల కష్టాన్ని గుర్తించి రోడ్డు సమస్య కి శాశ్వత పరిష్కారం చూపిన పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి రహదారి సమస్యను విన్నవించి రోడ్ మంజూరుకు పాటు పడిన భూక్యా సురేష్ నాయక్, గనపారపు వీరయ్య, కొట్టం శిరీష రంజిత్ రెడ్డి లకు స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## జ్యోతిబా పూలే జయంతి కమిటీ కో-కన్వీనర్‌గా మిద్దెల మల్లేశం గౌడ్



**ఎల్బీనగర్, పెన్ పవర్, ఏప్రిల్ 10:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతోత్సవాల రాష్ట్ర కమిటీ కో–కన్వీనర్‌గా ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన మిద్దెల మల్లేశం గౌడ్ నియమితులయ్యారు. శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక మెమో ప్రకారం 2026 సంవత్సరానికి పూలే జయంతి వేడుకలను రాష్ట్ర స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. సామాజిక సేవా రంగంలో చురుకైన పాత్ర పోషిస్తున్న మల్లేశం గౌడ్ ఈ బాధ్యతకు ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఈ నెల 11న ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే స్థానిక ప్రజలు, నాయకులు, అభిమానులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం




**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 10:** 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణలో భాగంగా శనివారం గార్ల మండల కేంద్రంలోని చిన్న కిస్టాపురం పెద్ద కిస్టాపురం ముల్కనూరు మద్దివంచ అంజనాపురం సత్యనారాయణ పురం గ్రామాలకు ఉదయం 9:30 గంటల నుండి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ ఏ మధు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు వినియోగదారులు వ్యాపారస్తులు విద్యుత్ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

## వేసవి దృష్ట్యా స్విమ్మింగ్ పూల్‌లో సౌకర్యాలు కల్పించాలి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 10 పెన్ పవర్:** వేసవి కాలం ప్రారంభం కావడంతో, ప్రజలకు, ముఖ్యంగా యువతకు, చిన్నారులకు సౌకర్యవంతమైన వాతావరణంలో ఈత అభ్యాసం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్విమ్మింగ్ పూల్‌లో నీటి శుభ్రత, ఫిల్టరేషన్ వ్యవస్థ, చేంజింగ్ రూములు, షవర్ సదుపాయాలు, భద్రతా చర్యలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. పూల్‌లోని నీరు నాణ్యంగా ఉండేలా తరచూ శుద్ధి చేయాలని, క్లోరినేషన్‌ను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం: కలెక్టర్



**బోథ్, ఏప్రిల్ 10 పెన్ పవర్:** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రపంచ హోమియోపతి దినోత్సవం, ఆయుష్ డే సందర్భంగా 'హెల్త్ వీక్' వేడుకలలో యోగా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా పాల్గొని ప్రజలు, అధికారులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు చేశారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కనీసం అరగంట సమయం యోగా లేదా వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష పాల్గొన్నారు.

## మొక్కజొన్న, జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి

**నిర్మల్, ఏప్రిల్ 10 పెన్ పవర్:** నిర్మల్ నియోజకవర్గంలో మొక్కజొన్న, జొన్న పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో రైతులు విస్తారంగా మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారని, కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి, నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ యార్డులలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## ముదిరాజ్ కులసంఘం నాయకుల అరెస్ట్

**ముథోల్, ఏప్రిల్ 10 పెన్ పవర్:** ముదిరాజ్ కులస్తులకు సామాజిక న్యాయం డిమాండ్ చేస్తూ ముదిరాజ్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన 'హలో ముదిరాజ్ ఛలో గాంధీ భవన్' ముట్టడి సందర్భంగా, నిర్మల్ జిల్లాలోని ముదిరాజ్ కుల సంఘం నాయకులను పోలీసులు శుక్రవారం ఉదయం అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ముదిరాజ్ సామాజిక వర్గానికి న్యాయం చేయడంలో విఫలమైందని నాయకులు ఆరోపించారు. హైదరాబాద్‌లోని కోకాపేట్ భూమిపై ఉన్న ట్రస్ట్‌ను రద్దు చేసి ముదిరాజ్ జాతికి అంకితం చేయాలని, పండుగ సాయన్న జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

## బెల్లంపల్లి రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు

**ఖానాపూర్, ఏప్రిల్ 10 పెన్ పవర్:** సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల వద్ద రాజీవ్ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడటంతో బెల్లంపల్లికి చెందిన శివప్రసాద్ చారి, ఐశ్వర్యలకు గాయాలయ్యాయి. హైదరాబాదులో ప్రీ వెడ్డింగ్ షూటింగుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు బండరాయిని ఢీ కొట్టి రోడ్డు కిందకు దూసుకుపోయింది. కారులో ఉన్న ముగ్గురిలో మరొకరికి గాయాలు కాలేదు. స్థానికులు 108 వాహనంలో గాయపడిన వారిని సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించారు.

## చికిత్స పొందుతూ బాలుడు మృతి

**కరీంనగర్, ఏప్రిల్ 10 పెన్ పవర్:** రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో పదో తరగతి చదువుతున్న బాలుడు వారం రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు, స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించగా రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## విగ్రహాల ఆవిష్కరణకు అనుమతి: దళిత సంఘాల నాయకుల హర్షం



**మానకొండూరు, ఏప్రిల్ 10 పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ బస్టాండ్ వద్ద మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేయడంతో దళిత సంఘాల నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణను అందరి సహకారంతో సుందరికరణ చేసి అద్భుతంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. దళితుల చిరకాల కోరిక నెరవేరనుండటంతో అఖిలపక్ష నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

## అధిక వేగంతో యువకుడు మృతి

**సిరిసిల్ల, ఏప్రిల్ 10 పెన్ పవర్:** గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన మద్దుల మనోజ్ రెడ్డి (18) రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, డ్రైవర్ నితిన్‌తో కలిసి సిరిసిల్లకు ట్రాక్టర్‌లో ఇంజిన్ ఆయిల్ మార్పిడి కోసం వెళ్లిన మనోజ్ రెడ్డి, తిరుగు ప్రయాణంలో వెంకటాపూర్‌లో ట్రాక్టర్ అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లడంతో దాన్ని కిందపడి మరణించారు. వేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని పోలీసులు పేర్కొన్నారు.

## ఆర్మూర్ లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ఆర్మూర్, ఏప్రిల్ 10(ఎ.ఎం.ఎస్):** నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్ లోని డొంకేశ్వర్ మండల కేంద్రంలో శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ జరిగింది. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ కుమార్ రెడ్డి సహకారంతో లాస్య, స్వప్నలకు రూ. 27,000 చొప్పున చెక్కులను డొంకేశ్వర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు భూమేష్ రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## సామాజిక న్యాయం ప్రపంచ శాంతికి వారధి

**హైదరాబాద్ పెన్ పవర్:** మానవ నాగరికత పరిణామ క్రమంలో పారిశ్రామిక విప్లవం ఒక మైలురాయి. అయితే, యంత్రాల హోరులో మనిషి శ్రమ దోపిడీకి గురవ్వడం, అమానవీయ పరిస్థితుల్లో కార్మికులు మగ్గిపోవడం ఆ విప్లవం తెచ్చిన మరో చీకటి కోణం. ఈ నేపథ్యంలో, "సామాజిక న్యాయం లేకుండా శాశ్వత ప్రపంచ శాంతి సాధ్యం కాదు" అనే గొప్ప ఆశయంతో ఉద్భవించిన అరుదైన వ్యవస్థ 'అంతర్జాతీయ కార్మిక సంస్థ'. ప్రపంచ చరిత్రలో కార్మిక హక్కుల పరిరక్షణకు ఒక దిక్సూచిలా నిలిచిన ఈ సంస్థ, గత శతాబ్ద కాలంగా శ్రామిక లోకానికి రక్షణ కవచంగా నిలుస్తోంది. 19వ శతాబ్దపు చివరలో, 20వ శతాబ్దపు ప్రారంభంలో ఐరోపా, అమెరికా ఖండాల్లో పారిశ్రామికీకరణ వేగంగా విస్తరించింది. కానీ, కార్మికులకు కనీస వేతనాలు లేవు, పని గంటలకు పరిమితి లేదు, ప్రాణాలకు రక్షణ లేని ప్రమాదకర వాతావరణం నెలకొంది. ఈ దోపిడీపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ దేశాలు శాంతి స్థాపన కోసం చర్చలు జరుపుతున్న తరుణంలో, కార్మిక సమస్యల పరిష్కారం కూడా ప్రపంచ శాంతిలో అంతర్భాగమేనని గుర్తించారు. ఈ క్రమంలోనే 1919లో జరిగిన 'వెర్సైల్లెస్ శాంతి ఒప్పందం' ద్వారా ఐ.ఎల్.ఓ ఆవిర్భవించింది. మొదట ఇది 'లీగ్ ఆఫ్ నేషన్స్'కు అనుబంధంగా పనిచేసినప్పటికీ, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1946లో ఐక్యరాజ్య సమితిలో చేరిన మొట్టమొదటి ప్రత్యేక అనుబంధ సంస్థగా గుర్తింపు పొందింది. దీని ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది. ఐ.ఎల్.ఓ యొక్క అత్యంత విశిష్టమైన లక్షణం దాని 'త్రైపాక్షిక నిర్మాణం'. ప్రపంచంలోని మరే ఇతర అంతర్జాతీయ సంస్థలోనూ ఇటువంటి ప్రజాస్వామ్య వ్యవస్థ కనిపించదు. ఇందులో ప్రభుత్వ ప్రతినిధులతో పాటు, యజమానుల సంఘాల ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులు సమాన స్థాయిలో కూర్చుని నిర్ణయాలు తీసుకుంటారు. ఈ నిర్మాణం వల్ల ఏ చట్టం లేదా ప్రమాణం రూపొందించినా, అది క్షేత్రస్థాయిలో అమలు కావడానికి అవసరమైన సమతుల్యత దొరుకుతుంది.

ఈ సంస్థ మూడు ప్రధాన విభాగాలుగా పనిచేస్తుంది. 'అంతర్జాతీయ కార్మిక సదస్సు' ఏటా ప్రమాణాలను నిర్ణయిస్తే, 'పాలక మండలి' కార్యనిర్వాహక బాధ్యతలు చేపడుతుంది. 'అంతర్జాతీయ కార్మిక కార్యాలయం' సచివాలయంగా సేవలందిస్తుంది. ఐ.ఎల్.ఓ లక్ష్యాల గురించి మాట్లాడుకుంటే, 1944లో ఆమోదించిన 'ఫిలడెల్ఫియా ప్రకటన' అత్యంత కీలకమైనది. "పేదరికం ఎక్కడున్నా అది ప్రపంచ సంపదకు ముప్పు" అని ఈ ప్రకటన ఘోషించింది. శ్రమ అనేది విక్రయ వస్తువు కాదని, భావప్రకటన స్వేచ్ఛ మరియు సంఘటితమయ్యే హక్కు పురోగతికి మూలమని ఇది చాటిచెప్పింది. ఈ స్ఫూర్తితోనే ఐ.ఎల్.ఓ ఇప్పటివరకు 190కి పైగా ఒప్పందాలను, 200కి పైగా సిఫార్సులను రూపొందించింది. వీటిలో ఎనిమిది ఒప్పందాలను 'కోర్ కన్వెన్షన్స్'గా పరిగణిస్తారు. బలవంతపు చాకిరీ నిర్మూలన, సంఘటిత హక్కు, సమాన వేతనం, వివక్ష రూపుమాపడం, మరియు బాల కార్మిక వ్యవస్థ అంతం చేయడం వంటివి ఇందులో భాగాలు. ముఖ్యంగా 1919లోనే 8 గంటల పని దినం, వారానికి 48 గంటల పని సమయాన్ని ప్రతిపాదించడం అప్పట్లో ఒక విప్లవాత్మక మార్పు. ప్రస్తుతం 187 సభ్యదేశాలతో విస్తరించిన ఈ సంస్థ, 1969లో తన 50వ వార్షికోత్సవం సందర్భంగా 'నోబెల్ శాంతి బహుమతి'ని గెలుచుకుంది. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం కాకుండా, మానవ గౌరవం కోసం చేస్తున్న కృషికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపు. 1999లో జువాన్ సోమావియా డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సమయంలో 'డీసెంట్ వర్క్'(గౌరవప్రదమైన ఉపాధి) అనే సరికొత్త నినాదాన్ని ఐ.ఎల్.ఓ తెరపైకి తెచ్చింది. కేవలం పని దొరకడం ముఖ్యం కాదు, అది మనిషి ఆత్మగౌరవాన్ని కాపాడేలా, సామాజిక భద్రతతో కూడినదిగా ఉండాలని ఇది స్పష్టం చేస్తోంది. భారతదేశ దృక్పథంలో చూస్తే, మన దేశం ఐ.ఎల్.ఓ స్థాపక సభ్య దేశాలలో ఒకటి. మన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, కార్మిక చట్టాలపై ఐ.ఎల్.ఓ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. 1923 నాటి కార్మికుల నష్టపరిహార చట్టం నుండి నేటి 'లేబర్ కోడ్స్' వరకు అన్నీ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగానే రూపుదిద్దు కున్నాయి. అయితే, గణాంకాలు నేటికీ సవాలు విసురుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 200 కోట్ల మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారని, వీరికి ఎటువంటి పెన్షన్ లేదా ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రత లేదని ఐ.ఎల్.ఓ హెచ్చరిస్తోంది. అలాగే 16 కోట్ల మంది బాల కార్మికులు ఉండటం మానవాళికి మాయని మచ్చగా మిగిలింది. నేడు ప్రపంచం నాలుగో పారిశ్రామిక విప్లవంలో ఉంది. కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి సాంకేతికతలు ఉద్యోగాల స్వరూపాన్ని మార్చేస్తున్నాయి. 'గిగ్ ఎకానమీ' పేరుతో కొత్త రకం ఉపాధి మార్గాలు వస్తున్నాయి. ఇక్కడ కార్మికులకు,

యజమానులకు మధ్య స్పష్టమైన నిర్వచనం లేకపోవడం వల్ల హక్కుల పరిరక్షణ క్లిష్టంగా మారింది. వలస కార్మికుల సమస్యలు, వాతావరణ మార్పుల వల్ల ఉపాధి కోల్పోతున్న వారి పరిస్థితి ఐ.ఎల్.ఓ ముందున్న ప్రస్తుత సవాళ్లు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని 'ఫ్యూచర్ ఆఫ్ వర్క్' పేరుతో ఐ.ఎల్.ఓ కొత్త కార్యాచరణను సిద్ధం చేస్తోంది. డిజిటల్ యుగంలో కూడా మానవీయ విలువలు మరుగవ్వకుండా చూడటమే ఈ సంస్థ తదుపరి లక్ష్యం. గత వంద ఏళ్లలో ఐ.ఎల్.ఓ సాధించిన విజయాలు అపారం. బానిసత్వం లాంటి పని పరిస్థితుల నుండి కార్మికులను విముక్తి చేయడంలో, మహిళలకు ప్రసూతి సెలవుల వంటి హక్కులు కల్పించడంలో, కనీస వేతన చట్టాలను అమలు చేయడంలో ఈ సంస్థ పాత్ర చిరస్మరణీయం. అయినప్పటికీ, ఇంకా పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, నిరుద్యోగితా రేటును చూస్తే ఐ.ఎల్.ఓ ప్రయాణం ముగియలేదని అర్థమవుతుంది. ప్రతి మనిషికి గౌరవప్రదమైన పని, ప్రతి కార్మికుడికి సామాజిక న్యాయం దక్కిన రోజే ఐ.ఎల్.ఓ ఆశయం పరిపూర్ణమవుతుంది. శ్రామిక శక్తే ప్రపంచ సంపదకు మూలమని నమ్మి, ఆ శ్రమను గౌరవించే సమాజం కోసం ఈ అంతర్జాతీయ సంస్థ నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది.

## జన్యులోపమే పార్కిన్సన్‌కు మూలం

**హైదరాబాద్ పెన్ పవర్:** 18వ శతాబ్దంలో జేమ్స్ పార్కిన్ సన్ అనే ఆంగ్లవైద్యుడు ఒళ్ళు ఒణుకు వ్యాధి అనే పేరుతో మొదట దీన్ని నిర్వచించిన కారణంగా పార్కిన్సన్స్ వ్యాధి అంటారు. ఈ వ్యాధి వేదకాలంలోనే ప్రస్తావించబడింది. ఆయుర్వేద సంహితలో అంటే ప్రాచీన భారతీయ వైద్యశాస్త్రంలో ఈ వ్యాధి, దాని లక్షణాలు, చికిత్స పేర్కొన బడ్డాయి. నాటి వైద్యశాస్త్ర నిపుణులు దీన్ని కంపవాత మన్నారు. 2500 సంవత్సరాలకు పూర్వమే నైజింగ్ (ఔవతిఏతినిణ) అనే చైనా వైద్యశాస్త్రంలో దీని గురించిన ప్రస్తావన వుంది. కంపవాతం ఆయుర్వేద రీత్యా ఒక నరాల జబ్బు. ఈ వ్యాధి సోకిన మనిషి కదలికలో వ్యత్యాసం కనిపిస్తుంది. కూర్చొని, పడుకొని ఉన్నంతసేపూ బాగుంటాడు. కాని లేచి నిలబడి కదలబోతే శరీరం వణికి ఇటూ అటూ కదిలిపోతూ పడిపోతుంటాడు. పార్కిన్సన్ వ్యాధిని ఇప్పటికీ కారణం తెలియని వ్యాధిగానే పరిగణిస్తు న్నారు. జన్యుపరంగా, పర్యావరణ కారణాలవల్ల ఈ వ్యాధి వస్తుంది. పర్యావరణ కాలుష్యం విషపదార్థాలు, ఎరువులు, డ్రగ్స్ (యాంటీ సైకోటిక్కో, వాంతి వచ్చే మందులు) తయారీ, తరచుగా తలనొప్పి తదితర కారణాలతో పార్కిన్సన్ వ్యాధి ముడిపడి ఉంది. మెదడులో ఉత్పన్నమయ్యే డోపమైన్ కణాలు తగ్గిన పక్షంలో ఈ వ్యాధి వచ్చినట్టు నిర్ధారణ చేసుకోవచ్చు. ప్రొటీనోపతి (ప్రోటీన్లకు సంబంధించిన రుగ్మత) వల్ల పార్కిన్సన్ వ్యాధివచ్చే అవకాశముంది. పార్కిన్సన్ వ్యాధి సర్వసాధారణ వ్యాధి. ఇది సమాజంలో ప్రబలంగా ఉంది. 60 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు ఇది వస్తుంది. దీన్ని వృద్ధాప్యంలో వచ్చే అంగవైకల్య వ్యాధిగా పరిగణిస్తారు. "వణుకుడు రోగం" లేక "పార్కిన్సన్స్ వ్యాధి" నాడీ కణాలను (నరాల కణాలను) దెబ్బ తీయడం ద్వారా ప్రగతిశీల మెదడు దెబ్బకు దారితీస్తుంది. 'డోపమైన్' అని పలవబడే న్యూరోట్రాన్స్మిటర్ ద్వారా మెదడు అంతటా సంకేతాలు ప్రసరించే బాధ్యత ఈ నాడీ కణాలదే. సాధారణ పరిస్థితులలో, మృదువైన, సమతుల్య కండరాల సమన్వయాన్ని డోపమైన్ సహాయంతో సాధించవచ్చు. ఈ డోపామైన్ అనే ఈ న్యూరోట్రాన్స్మిటర్ లేకపోవడం మూలంగానే "పార్కిన్సన్స్ వ్యాధి" లేక వణుకుడు రోగం మనుషుల్లో సంభవిస్తుంది. పార్కిన్సన్స్ వ్యాధి యొక్క ప్రారంభ మరియు అత్యంత సాధారణ లక్షణాలు శరీరంలోని అవయవాల్లోని ఏదో ఒక భాగంలో... చేతులు లేదా కాళ్ళు లేదా దవడ లోనైనా, వణుకుడు రావడం. చేయి విశ్రాంతి దశలో ఉన్నప్పుడు ప్రకంపన లేదా వణుకు సాధారణంగా గుర్తించ బడుతుంది, సాధారణంగా చూపుడు వేలుకు వ్యతిరేకంగా బొటనవేలు యొక్క కదలికను చూడవచ్చు. దీని రెండవ లక్షణం సాధారణంగా

కండరాల పెడసరం లేదా కండరాలు బిగదీయడం. మనిషి స్వేచ్ఛా చలన వలయాల్ని కుంటుపరుస్తూ (పరిమితం చేస్తూ) అనియంత్రితమైన కండరాల పెడసరం లేక కండరాలు పట్టేయడ మనేది వణుకుడు వ్యాధి లక్షణం. వ్యాధికి గురైన వ్యక్తులు చేపట్టిన ఏదైనా పనియొక్క వేగంలో క్రమమైన తగ్గుదలను చూపుతారు. స్నానం లేదా తినడం వంటి సాధారణ కార్యకలాపాల్ని పూర్తి చేయడంలో కూడా వీళ్ళు అసాధారణంగా ఎక్కువసేపు తీసుకోవాల్సి వస్తుంది. సాపేక్షంగా అరుదుగా ఉండే లక్షణాలలో భయము, చొంగ కార్చడం, చర్మ సమస్యలు, మూత్ర సమస్యలు, లైంగిక అసమర్థత ఉంటాయి. వ్యాధి బాధితుడి వణుకుడు గణనీయంగా సదరు వ్యక్తి మాటల్ని మరియు చేతివ్రాతను దెబ్బ తీస్తుంది. వణుకుడు రోగానికి సంభావ్య కారణాలను గుర్తించడానికి పరిశోధన కొనసాగుతున్నప్పటికీ, అదిప్పటికీ తెలియదు. జన్యు కారకాలు మరియు కొన్ని పర్యావరణ పరిస్థితుల్ని వణుకుడు జబ్బుకు ప్రమాద కారకాలుగా భావిస్తారు. పార్కిన్సన్స్ వ్యాధిని అభివృద్ధి చేయడంలో జన్యు పరివర్తనలు ప్రమాద కారకంగా గుర్తించబడ్డాయి, యాంటిసైకోటిక్ ఔషధాలను సేవించే వ్యక్తులు లేదా మెదడు అనారోగ్యంతో బాధపడుతున్న వారిలో లేదా గతంలో స్ట్రోక్ లకు గురై బాధపడుతున్న వ్యక్తులకు వణుకుడు రోగం సంభవించ వచ్చునని భావించ బడుతోంది. పరిస్థితిని నిర్ధారించడానికి నిర్దిష్ట రక్తం లేదా ప్రయోగశాల పరిశోధన

లేనందున పార్కిన్సన్స్ వ్యాధి నిర్ధారణను గందరగోళంగా చెప్పవచ్చు. అంతే కాకుండా, లక్షణాలు తరచూ కీళ్ళ అసాధారణతలు లేదా విటమిన్ లోపాల వంటి ఇతర రుగ్మతలను అనుకరిస్తాయి. ఒక అర్హత కలిగిన న్యూరాలజిస్ట్ తో సలహా, సంప్రదింపులు తీసుకోవాలి. ఈ న్యూరాలజిస్ట్ కొంతకాలం పాటు లక్షణాలను పరిశీలించి, వ్యాధి పురోగతిని ఆపడమే లేక నియంత్రించడమో చేయగలరు. చికిత్సకు సంబంధించినంత వరకు, 'డోపమైన్' లోప పరిస్థితికి వివిధ రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఈ మందులు వ్యాధికి గురైన మెదడు బాగాలను ప్రేరేపించడం ద్వారా పని చేస్తాయి. అయితే, దీర్ఘకాలిక దశలో, ఈ మందులు దుష్ప్రభావాలను చూపుతాయి. మందులు వ్యాధి లక్షణాలను నియంత్రించ లేకుంటే, శస్త్రచికిత్స అవసరం కావచ్చు. మెదడును ప్రేరేపించటానికి ఎలక్ట్రోడ్లు ఉపయోగించడం ఇందులో జరుగుతుంది, ఇలా చేయడం ద్వారా వణుకుడ్ని ప్రేరేపించడానికి దారితీసే ప్రేరణల్ని అడ్డుకోవడం జరుగుతుంది. పార్కిన్సన్స్ వ్యాధి ఒక ప్రగతిశీల రుగ్మత. ఈ రుగ్మతకు ఖచ్చితమైన నివారణ లేదు. మానసిక ఆరోగ్యాన్ని, శారీరక చర్యల్ని చేపట్టే సామర్థ్యాన్ని కాపాడు కోవడమే ఈ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తుల దీర్ఘకాలిక లక్ష్యాలుగా ఉండాలి.

## ఉపాధి హామీ పనుల్లో కొత్త హాజరు విధానం:

**మిర్యాలగూడ, ఏప్రిల్ 10 పెన్ పవర్:** నల్గొండ జిల్లా, మిర్యాలగూడ నియోజకవర్గంలో గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 4 గంటల వరకు ఎండలో పనిచేస్తూ అలసిపోతున్నారు. కొత్తగా అమల్లోకి వచ్చిన ఔఖీఇఉం హాజరు విధానం వల్ల సాంకేతిక సమస్యలు, కఠిన సమయపాలన నిబంధనలతో కార్మికులు మరిన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## విదేశీ నిందితుడి అరెస్ట్

**నల్లగొండ, ఏప్రిల్ 10 పెన్ పవర్:** నకిలీ కరెన్సీ నోట్ల ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు, మాలి దేశానికి చెందిన సాల్మన్ ఉమ్ దాలియా అనే విదేశీ నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి మూడు కట్టల నకిలీ రూ.500 నోట్ల సైజు కాగితాలు, 2 వేల రూపాయల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఎస్పీ కార్యాలయంలో విలేకరులకు తెలిపారు. సాల్మన్ దాదాపు రెండేళ్ల క్రితం భారత్‌కు వచ్చి, కొందరు వ్యక్తులతో కలిసి నకిలీ కరెన్సీతో మోసాలకు పాల్పడుతున్నట్లు సమాచారం.

## నాటో, ఐరోపా దేశాల నుంచి అమెరికా బలగాలు వెనక్కి?

**హైదరాబాద్ పెన్ పవర్:** నాటో, ఐరోపా దేశాల నుంచి అమెరికా బలగాలు వెనక్కి తగ్గనున్నాయని సమాచారం. నాటో మిత్రదేశాల కారణంగా నిరాశకు గురైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ దిశగా అడుగులు వేయనున్నారంటూ ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్, గ్రీన్‌ల్యాండ్ విషయంలో మనస్పర్థల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోనున్నారని వైట్‌హౌస్ సీనియర్ అధికారి చెప్పినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు రాసుకొచ్చాయి. "నాటో మిత్ర దేశాలు హర్మ్యూజ్ జలసంధిని తిరిగి తెరిపించడంలో ఎలాంటి సాయం చేయలేకపోయాయి. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలన్న ట్రంప్ ప్రణాళిక ముందుకు కదలట్లేదు. ఈ కోపంతోనే నాటో నుంచి వెనక్కితగ్గే విషయంపై సలహాదారులతో చర్చించారు. అంతర్గత చర్చలు జరిపినప్పటికీ ఈ అంశంపై ఇంతవరకు ఓ నిర్ణయానికి రాలేదు. వాషింగ్టన్- యూరప్ దేశాల మధ్య సంబంధాలు మాత్రం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇటీవల నాటో సెక్రటరీ జనరల్ మార్క్ వాషింగ్టన్‌ను సందర్శించిన సమయంలోనే ఈ విషయం వెలుగులోకి వచ్చింది" అంటూ సదరు కథనం వెల్లడించింది. 1949లోనే ఈ కూటమి(ఔయీా) స్థాపించినా ఇందులో ఉన్న దేశాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి ఇంతవరకు ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. రెండో ప్రపంచ యుద్ధం జరిగిన తర్వాత నుంచి ఐరోపా భద్రత విషయంలో అండగా నిలిచేందుకు పెద్దసంఖ్యలో అమెరికా సైన్యం మోహరించింది. జర్మనీ, యూకే, ఇటలీ, స్పానిష్‌లోనూ అమెరికా(జూ) బలగాలు ఉన్నాయి. "ట్రంప్ అసంతృప్తి ఇప్పటిది కాదు.. కొన్ని నెలలుగా పెరుగుతూ వస్తోంది. రక్షణరంగంలో ఐరోపా మిత్రదేశాలు తగినంత పెట్టుబడులు పెట్టడం లేదని ఆయన చాలాకాలంగా ఆరోపిస్తున్నారు. అయితే ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటినుంచి ఉద్రిక్తతలు తీవ్రంగా పెరిగాయి.

## ఇజ్రాయెల్- పాక్ మధ్య మాటల యుద్ధం

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్‌లో అమెరికా- ఇరాన్ మధ్య శాంతి చర్చలు జరగనున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇజ్రాయెల్- పాక్ మధ్య దౌత్యపరమైన వివాదం చెలరేగింది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ నరమేధం సృష్టిస్తోందంటూ పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన పోస్టు ఈ వివాదానికి కారణం. ఖవాజా వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ తీవ్రంగా మండిపడింది. అసలేం జరిగిందంటే.. 'ఇజ్రాయెల్ మానవాళికి శాపం. ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు జరుగుతుండగా.. లెబనాన్‌లో మారణహోమానికి పాల్పడుతోంది. అమాయక పౌరులను ఆ దేశం పొట్టనపెట్టుకుంటుంది. తొలుత గాజా.. ఆ తర్వాత ఇరాన్.. ఇప్పుడు లెబనాన్‌లో రక్తపాతాన్ని కొనసాగిస్తూనే ఉంది. యూదుల భారాన్ని వదిలించుకునేందుకు పాలస్తీనా భూభాగంపై ఇజ్రాయెల్ దేశాన్ని ఏర్పాటుచేసినవారు నరకంలో కాలిపోవాలని ప్రార్థిస్తున్నా' అని ఖవాజా ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈసందర్భంగా ఇజ్రాయెల్‌ను క్యాన్సర్ దేశంగా పేర్కొన్నారు. తన వ్యాఖ్యలపై వ్యతిరేకత రావడంతో తాజాగా ఈ పోస్టును తొలగించడం గమనార్హం. ఈ వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం మండిపడింది. ఇజ్రాయెల్ నాశనం కావాలంటూ.. ఖవాజా పిలుపునివ్వడం అత్యంత దారుణమైన చర్యగా పేర్కొంది. కొనసాగుతోన్న శాంతి చర్చల్లో తటస్థ పాత్ర పోషిస్తున్నట్లు పేర్కొన్న దేశం నుంచి ఇలాంటి ప్రకటనలు రావడం సహించరానిదని స్పష్టంచేసింది. ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సర్ కూడా ఖవాజా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తమ దేశాన్ని క్యాన్సర్‌తో పోల్చడం.. వారి వినాశనానికి పిలుపునివ్వడమేనని హెచ్చరించారు. అమెరికా- ఇరాన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దీన్ని శాశ్వత శాంతిగా మార్చేందుకు ఇస్లామాబాద్ వేదికగా తదుపరి చర్చలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఇజ్రాయెల్- పాక్ మధ్య ఈ వివాదం తలెత్తడం గమనార్హం.

## హర్మ్యూజ్ నిర్వహణను కొత్త దశకు తీసుకెళతాం

**హైదరాబాద్ పెన్ పవర్:** హర్మ్యూజ్ జలసంధి నిర్వహణపై ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ కీలక ప్రకటన చేశారు. జలసంధి నిర్వహణను కొత్త దశకు తీసుకెళ్తామని ప్రకటించారు. ఈ దశలో హర్మ్యూజ్‌పై అనుసరించే విధానం మరింత వ్యూహాత్మకంగా, కఠినంగా ఉంటుందని సంకేతాలు ఇచ్చారు. ఈ మేరకు ఆయన చేసిన ప్రకటనను ఆ దేశ మీడియా చదివి వినిపించింది. అమెరికా- ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయినప్పటికీ.. చమురు రవాణాకు కీలకమైన హర్మ్యూజ్‌లో పరిస్థితులు కుదుటపడలేదు. ఈ క్రమంలో జలసంధిని కొత్త దశకు తీసుకెళ్తామంటూ మొజ్తాబా ప్రకటించడం కీలక పరిణామంగా మారింది. ఇక, ఇరాన్‌యుద్ధాన్ని కోరుకోవడం లేదని సుప్రీం నేత స్పష్టంచేశారు. కానీ, ఎట్టిపరిస్థితుల్లో తమ హక్కులను వదులుకోమని వ్యాఖ్యానించారు. దాడుల్లో తన తండ్రి అయతుల్లా అలీ ఖమేనీ సహా, అనేకమంది కీలక నేతల మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలని ఇరాన్ దృఢ నిశ్చయంతో ఉందన్నారు. యుద్ధంలో ఇరాన్ స్పష్టమైన విజయం సాధించిందని వెల్లడించారు. ఈ దాడుల్లో జరిగిన నష్టాలన్నింటికీ పరిహారం చెల్లించాలని తాము డిమాండ్ చేస్తామన్నారు.

## లెబనాన్‌పై మరోసారి ఇజ్రాయిల్ దాడులు

**హైదరాబాద్ పెన్ పవర్:** లెబనాన్‌పై గురువారం కూడా ఇజ్రాయిల్ దాడులు చేపట్టింది. అబ్బాసియే పట్టణంపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో సుమారు ఏడుగురు మరణించారని, మరికొంతమంది గాయపడ్డారని మీడియా తెలిపింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ దాడుల్లో హెజ్బుల్లా ప్రధాన కార్యదర్శి నయీమ్ ఖాసేం మేనల్లుడిని హతమార్చినట్లు ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. నదీ మార్గాలపై సైతం దాడులు చేపట్టినట్లు పేర్కొంది. బుధవారం అర్ధరాత్రి, గురువారం తెల్లవారుజామున లెబనాన్ రాజధాని బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలపై దాడి చేసినట్లు లెబనాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. ఉదయం కూడా దాడులు కొనసాగాయని, దక్షిణ ప్రాంతంలోని పట్టణాలపై ఇజ్రాయిల్ దాడిచేసినట్లు వెల్లడించింది. కస్మియా వంతెన సమీపంలోని కాఫ్రా, జెమాజ్మె, సఫద్ అల్ బతిఖ్, మజ్దల్ సెల్మ్, దైర్ అంటార్ సహా పలు పట్టాణాలపై ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు వరుస దాడులు జరిపినట్లు తెలిపింది. హారిస్ పట్టణం పూర్తిగా దెబ్బతిందని పేర్కొంది.

## ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో శాంతి చర్చలు అసమంజసం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో శాంతి చర్చలు 'అసమంజసం' అని ఇరాన్ పేర్కొంది. లెబనాన్‌పై బుధవారం ఇజ్రాయిల్ అత్యంత తీవ్రంగా విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో 245 మంది మరణించారు. ఇరాన్ ప్రతీకార హెచ్చరిక జారీ చేస్తూ.. అమెరికాతో శాశ్వత శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకునే దిశగా చర్చలను కొనసాగించడం అవివేకమవుతాయని ఇరాన్ ప్రధాన రాయబారి, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగర్ ఖాలిబాఫ్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు అనుకూలంగా ఉన్న హిజ్బుల్లాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని తీవ్రతరం చేసి ఇప్పటికే కాల్పుల విరమణ ఒప్పందంలోని పలు షరతులను ఉల్లంఘించిందని ఖాలిబాఫ్ పేర్కొన్నారు. ఇరాన్ అణు లక్ష్యాలను వదులుకోవాలని అమెరికా షరతులు విధించి ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో, ద్వైపాక్షిక కాల్పుల విరమణ లేదా చర్చలు అసమంజసం అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాల్పుల విరమణ ఒప్పందంలోని నిబంధనల ప్రకారం యురేనియం నిల్వలనుకొనసాగించడానికి తమకు అనుమతి ఉందని ఆయన పేర్కొన్నారు.

# లెబనాన్‌పై దాడులు చేయమని మేమెప్పుడూ వాగ్దానాలు చేయలేదు



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్‌పై గత నెల రోజులకు పైగా భీకర దాడికి పాల్పడింది. తాజాగా బుధవారం రెండువారాల పాటు ఇరాన్‌పై బాంబు దాడులను నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అయితే ప్రకటించిన కొద్దిసేపటికే ఇజ్రాయిల్ లెబనాన్‌పై వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో రెండు వందల మందికిపైగా మృతి చెందారు. ఈ నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందంలోకి లెబనాన్ వస్తుందని వార్తలొచ్చాయి. అయితే ఈ వాదనల్ని అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ తోసిపుచ్చారు. ఈ విషయంపై తాజాగా ఆయన హంగేరిలో మీడియాతో మాట్లాడారు. శాంతి ప్రతిపాదనలో లెబనాన్‌ను చేర్చారా? అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు 'మేము ఎన్నడూ అలాంటి వాగ్దానాలు చేయలేదు' అని సమాధానమిచ్చారు. ఈ కాల్పుల విరమణ ఇరాన్, అమెరికా మిత్రదేశాలైన ఇజ్రాయిల్, గల్ఫ్ అరబ్ దేశాలకు మాత్రమే వర్తిస్తుందని, లెబనాన్‌కు వర్తించదని ఆయన నొక్కిచెప్పారు.

## 'సముద్రంలోనే 230చమురు నౌకలు

**హైదరాబాద్ పెన్ పవర్:** హోర్ముజ్ జలసంధి మూసివేత గల్ఫ్ దేశాలకు గణనీయమైన నష్టాలను కలిగించింది. అమెరికా, ఇజ్రాయిల్‌లతో జరిగిన యుద్ధాల సమయంలో ఇరాన్ అత్యధిక దాడులకు లక్ష్యంగా ఉన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) కూడా ఇందులో ఉంది. మధ్యప్రాచ్య సంఘర్షణ వల్ల యూఏఈ అత్యంత తీవ్రంగా దెబ్బతింది. ఇప్పటికీ 230 చమురు నౌకలు సముద్రంలో ఉన్నాయి. కాల్పుల విరమణ కుదిరినందున, తమ నష్టాలకు పరిహారంగా హోర్ముజ్ జలసంధిని వీలైనంత త్వరగా తిరిగి తెరవాలని యూఏఈ డిమాండ్ చేస్తోంది. యూఏఈ ప్రభుత్వ రంగ చమురు సంస్థ, అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ (ఏడీఎన్ఓసీ) సీఈఓ, యూఏఈ పరిశ్రమ, అధునాతన సాంకేతిక శాఖ మంత్రి అయిన సుల్తాన్ అహ్మద్ అల్ జాబెర్ తెలిపారు.

## హోర్ముజ్ నుంచి వెనుదిరుగుతున్న నౌకలు

**హైదరాబాద్ పెన్ పవర్:** కాల్పుల విరమణ ఒప్పందం జరిగినప్పటికీ.. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులతో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. ఈ దాడులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసేస్తున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దీనికి సంబంధించిన కీలక విషయం వెలుగులోకి వచ్చింది. జలసంధిని పూర్తిగా మూసేయడంతో దీని మీదుగా వెళ్లాల్సిన నౌకలు బలవంతంగా వెనక్కి మరలుతున్నట్టు తెలుస్తోంది. ఈమేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.మారిటైమ్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. గ్రీక్‌కు చెందిన బల్క్ క్యారియర్, లైబీరియా జెండా కలిగిన రెండు నౌకలు హోర్ముజ్‌ను దాటాయి. కాల్పుల విరమణ తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు కొనసాగి స్తుండటంతో.. ఇరాన్ హోర్ముజ్‌ను పూర్తిగా మూసివేసింది. దీంతో ముసందమ్ తీరం సమీపంలో ఈ నౌక బలవంతంగా వెనుదిరగాల్సి వచ్చింది. అంతర్జాతీయ రవాణాకు అత్యంత కీలకమైన ఈ మార్గంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. దీంతోపాటు మరికొన్ని నౌకలు కూడా ఇలానే వెనుదిరిగినట్టు

మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇక, మంగళవారం నాటికి సరకుతో నిండిన 187 ట్యాంకర్లు సహా వెయ్యికి పైగా నౌకలు హోర్ముజ్ జలసంధి సమీపంలోనే ఉన్నాయని క్లెప్లర్ పేర్కొంది. పరిస్థితులు చక్కబడి సాధారణ రాకపోకలు ప్రారంభమైనా.. ఈ నౌకలు జలసంధిని దాటేందుకు రెండు వారాలకు పైనే పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఎందుకీ తొందరపాటు చర్య



**హైదరాబాద్ పెన్ పవర్:** లోక్‌సభలో సీట్ల సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ గురువారం తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిని అధికార పునర్వ్యవస్థీకరణగా ఆయన అభివర్ణించారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా నారీశక్తి వందన్ అధినియం ద్వారా పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలైతే ఉత్తరాది రాష్ట్రాల సీట్లు దాదాపు రెట్టింపు అవుతాయి. లోక్‌సభలో దక్షిణ రాష్ట్రాల వాటా సుమారు 24 శాతంగా ఉంటుంది అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్‌కు డిఎంకె వ్యతిరేకం కాదు. అయితే సభలో సీట్లను పెంచకుండా ఈ చట్టాన్ని అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఇది సంస్కరణ కాదు. అధికారాన్ని పునర్నిర్మించడం అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ఆరో పించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పార్లమెంటు పునాదులను క్రమపద్ధతిలో దెబ్బతీస్తోంది. చర్చలకు, జవాబుదారీతనానికి చైతన్యవంతమైన వేదికగా ఉండాల్సిన పార్లమెంటు.. వాటికి దూరంగా ఉంటుంది.

## కేరళ, అసోం, పుదుచ్చేరిలో ముమ్మరంగా పోలింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** కేరళ, అసోం, పుదుచ్చేరిలో ముమ్మ రంగా పోలింగ్ సాగుతోంది. ఓటు హక్కు వినియోగంచునేందుకు క్యూలైన్ ఉత్సహంగా ఓటర్లు నిలుచునున్నారు. గురువారం ఉదయం 11 గంటల సమయానికి అస్సాంలో 38.92 శాతం, కేరళలో 33.28 శాతం ఓటింగ్ నమోదైంది. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో 37.06 శాతం ఓటింగ్ నమోదైంది. అంతకుముందు ఉదయం 9 గంటలకు అస్సాంలో 17.87 శాతం, కేరళలో 16.23 శాతం ఓటింగ్ నమోదైంది. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఉదయం 9 గంటలకు 17.41 శాతం పోలింగ్ నమోదైంది. ఇవాళ మూడు రాష్ట్రాల్లో ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. అస్సాం, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఓటింగ్ ప్రారంభమైంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అసోంలో 126 స్థానాలకు 722 మంది పోటీ చేస్తున్నారు. కేరళలో 140 స్థానాల్లో 883 అభ్యర్థులు పోటీ చేస్తుండగా.. పుదుచ్చేరిలో 30 స్థానాలకు గాను 294 మంది అభ్యర్థులు ఉన్నారు. అదే విధంగా తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు, పశ్చిమ బెంగాల్‌లోని 152 స్థానాలకు మొదటి విడత పోలింగ్ ఏప్రిల్ 23న జరగనుంది. ఇక పశ్చిమ బెంగాల్‌లో 142 స్థానాలకు రెండో విడత పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది. నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మే 4న విడుదలకానున్నాయి.

# రెండవ ఎయిర్ డ్రాపింగ్ టెస్ట్ పరీక్ష విజయవంతం

**హైదరాబాద్ పెన్ పవర్:** రెండవ ఎయిర్ డ్రాపింగ్ టెస్ట్ (ఐఎడిటి-02) విజయవంతమైనట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తెలిపింది. శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రంలో శుక్రవారం ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. కేంద్ర సైన్స్, సాంకేతిక శాఖ సహాయక మంత్రి జితేంద్రసింగ్ ఐఎడిటి-02 సాధించిన విజయాన్ని ఎక్స్‌లో వెల్లడించారు. వచ్చే ఏడాది నిర్వహించనున్న భారతదేశపు మొట్టమొదటి మానవసహిత అంతరిక్షయాత్ర గగన్‌యాన్ కోసం రెండవ ఎయిర్ డ్రాపింగ్ టెస్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసినందుకు ఇస్రోకు అభినందనలు అని తెలిపారు. శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్షకేంద్రంలో ఈ రెండవ ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ విజయవంతంగా నిర్వహించారని అన్నారు. గగన్‌యాత్ర సంసిద్ధతలో ఈ విజయం ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ఎక్స్‌లో పేర్కొన్నారు. గతేడాది ఆగస్టు 24న, గగన్‌యాన్ కోసం శ్రీహరికోటలో ఇస్రో మొదటి ఎయిర్ డ్రాప్ టెస్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసిన సంగతి తెలిసిందే. ఎయిర్ డ్రాప్ పరీక్షలో భాగంగా మాడ్యూల్ చివరి, తక్కువ ఎత్తులో దిగడాన్ని పరిశీలించేందుకు ఒక హెలికాప్టర్ లేదా విమానం నుండి డమ్మీ స్పేస్ క్యాప్సూల్‌ను జారవిడుస్తారు. ఇది 2.5-3 కిలోమీటర్ల ఎత్తులో పారాచూట్ తెరుచుకోవడం, భద్రతా యంత్రాంగాలు, స్ప్లాష్ డౌన్ స్థిరత్వాన్ని పరీక్షిస్తుంది.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కాంకేర్ జిల్లాలో జాతీయ రహదారి 30పై ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఒకదానికొకటి ఢకొ?న్నాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందినట్లు పోలీసులు శుక్రవారం వెల్లడించారు. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. కాంకేర్ కొట్వాలి పోలీస్ స్టేషన్ పరిధిలోని నథియా నవాగోయన్ గ్రామం సమీపంలో ఈ ప్రమాదం జరిగిందని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. చరమ ప్రాంతంలోని ఉద్కుడ గ్రామానికి చెందిన మాండవి కుటుంబంలోని ఏడుగురు సభ్యులు చివరాజ్ గ్రామంలో గురువారం రాత్రి జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వీరు ప్రయాణిస్తున్న కారు ఎదురుగా వస్తున్న కారును ఢకొ?ట్టిందని పోలీసు అధికారి చెప్పారు. ఈ ప్రమాదంలో రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ఘటనలో ఒక కారులోని ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఓ చిన్నారితో సహా ఆరుగురు అక్కడిక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్రంగా గాయాలయ్యాయి. మరో కారులోని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే పోలీస్ సూపరింటెండెంట్ ? నిఖిల్ రాఖేచాతోపాటు పలువురు పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయాలపాలైన వారిని చికిత్స కోసం కాంకేర్ మెడికల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.


## బెంగాల్‌లో 90 లక్షల మంది ఓటర్లు గల్లంతు

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమ బెంగాల్‌లో 90 లక్షల మంది ఓటర్లు ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా తొలగింపునకు గురయ్యారు. వారిలో 63% మంది హిందువులు, 34% మంది ముస్లిములు ఉన్నారు. రాష్ట్ర జనాభాలో వారి శాతం 27తో పోలిస్తే తొలగించిన ముస్లిములు అధికంగా ఉన్నారు. మతువా జనాభా అధికంగా కలిగిన సరిహద్దు నియోజకవర్గాల్లో హిందువుల పేర్ల తొలగింపు రేటు అధికంగా ఉన్నాయి. ఓటర్ల ప్రత్యేక సమగ్ర జాబితా (ఎస్ఐఆర్) ప్రక్రియకు ముందు, తర్వాత బూత్ స్థాయి గణాంకాలను పోల్చి చూస్తే, తొలగింపునకు గురైన ఓటర్లలో 57.47 లక్షల మంది (63%) హిందువులు కాగా, 31.1 లక్షల మంది (34%) ముస్లిములు ఉన్నట్లు తేలింది. 2011 నాటి చివరి జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాలో ముస్లిములు కేవలం 27% మాత్రమే ఉన్నందున, ఈ గణాంకం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. సంఖ్యాపరంగా చూస్తే, అత్యధిక సంఖ్యలో పేర్లు హిందువులవే తొలగించారు. బిజెపి మినహా, పశ్చిమ బెంగాల్‌లోని మిగిలిన రాజకీయ పార్టీలన్నీ ఎస్ఐఆర్ ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకించినా? ఈ ప్రక్రియ చేపట్టడం, తొలగింపులు అధికంగా ఉండటం వివాదాస్పదమైంది.

## నోట్ల కట్టల వ్యవహారం.. జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా

**హైదరాబాద్ పెన్ పవర్:** అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మరాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపించారు. గతంలో దిల్లీలోని తన నివాసంలో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆయనను తొలగించేందుకు అభిశంసన ప్రక్రియకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. దిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. ఆ మంటలను ఆర్పేందుకు వచ్చిన అగ్నిమాపక సిబ్బంది కాలిపోయిన నోట్ల కట్టలను గుర్తించారు. ఈ ఘటనపై అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా.. అంతర్గత విచారణ కోసం ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో ఓ కమిటీని వేశారు. నోట్ల కట్టలు దొరికింది వాస్తవమేనని ఆ కమిటీ తేల్చింది. దీంతో రాజీనామా చేయాల్సిందిగా జస్టిస్ వర్మకు సీజేఐ సూచించారు. ఆయన తిరస్కరించడంతో.. అభిశంసనకు సిఫారసు చేస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీలకు సుప్రీం ప్రధాన న్యాయమూర్తి లేఖలు రాశారు. జస్టిస్ వర్మను విధుల నుంచి తొలగించాలని కోరుతూ పార్లమెంటు ఉభయసభల్లో ఎంపీలు అభిశంసన తీర్మానాన్ని ఇచ్చారు. ఈ రాజీనామాతో అభిశంసన ప్రక్రియ ముగిసిపోతుందని లోక్‌సభ సెక్రటేరియట్ వర్గాలు మీడియాకు వెల్లడించాయి.

## సీఏపీఎఫ్‌లో వివక్షను రూపుమాపుతాం



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర సాయుధ పోలీసు దళా(సీఏపీఎఫ్)ల్లో నాయకత్వ స్థానాలకు ఎంపిక విషయంలో సిబ్బందికి అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆ వివక్షను రూపుమాపి, ఉన్నతాధికారులుగా సీఏపీఎఫ్‌కు చెందిన వారినే నియమిస్తామని, బయటి నుంచి తీసుకురాబోమని హామీ ఇచ్చారు. గురువారం సీఆర్పీఎఫ్ శౌర్య దినోత్సవం సందర్భంగా ఆ సంస్థ సిబ్బందికి రాహుల్‌గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. 'నక్సలైట్లను, ఉగ్రవాదులను ఎదుర్కోవడంతో పాటు ఎన్నికల నిర్వహణకు దశాబ్దాలుగా మీరు ఎన్నో త్యాగాలు చేశారు. అయినా మీకు రావాల్సిన సమయంలో పదోన్నతులు రావడం లేదు. మీ సంస్థల్లో నాయకత్వ స్థానాలకు బయటి వారిని ఎంపిక చేస్తున్నారు. ఇది ఉద్యోగాలకు సంబంధించినది కాదు. ఆత్మగౌరవానికి సంబంధించినది. మేము అధికారంలోకి వస్తే ఈ పరిస్థితిని మారుస్తాం' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. సీఏపీఎఫ్ పరిధిలో ఐదు రకాల దళాలు ఉండగా ఆ సిబ్బంది నియామకాలు, పదోన్నతుల పర్యవేక్షణకు ఏకీకృత వ్యవస్థను తీసుకురావాలని కేంద్రప్రభుత్వం ఇటీవల ఓ బిల్లును తీసుకొచ్చింది. దీనిని పార్లమెంటరీ జాయింట్ కమిటీకి పంపాలని ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేసినప్పటికీ.. రాజ్యసభ, లోక్‌సభల్లో ఈ బిల్లు ఆమోదం పొందింది.

# ఇకపై ఆ వీడియోలకు చెక్..

## ఇన్‌స్టాగ్రామ్ నిబంధనల్లో కీలక మార్పులు..!



సోషల్ మీడియా దిగ్గజం మెటా, టీనేజర్ల భద్రత కోసం ఇన్‌స్టాగ్రామ్‌లో చారిత్రాత్మకమైన మార్పులను ప్రకటించింది. సున్నితమైన, అభ్యంతరకర కంటెంట్ నుంచి 18 ఏళ్లలోపు పిల్లలను రక్షించడానికి ప్రపంచవ్యాప్తంగా కఠినమైన ఫిల్టర్లను అమల్లోకి తెచ్చింది. ఇకపై మైనర్ల ఫీడ్‌లో అభ్యంతరకర పోస్ట్‌లకు తావులేకుండా ఆటోమేటిక్ సెట్టింగ్‌లను సంస్థ సిద్ధం చేసింది. నేటి కాలంలో సోషల్ మీడియా ప్రభావం చిన్న పిల్లలపై తీవ్రంగా ఉంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, మైనర్ల మానసిక ఆరోగ్యం, భద్రత కోసం మెటా సంస్థ తన కంటెంట్ పాలసీని పూర్తిగా సవరించింది. ముఖ్యంగా 18 ఏళ్లలోపు వినియోగదారుల కోసం ఇన్‌స్టాగ్రామ్‌లో సరికొత్త రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసింది. అమెరికా వంటి దేశాల్లో ఎదుర్కొంటున్న చట్టపరమైన ఒత్తిడి, వినియోగదారుల ఆందోళనల నేపథ్యంలో ఈ గ్లోబల్ అప్‌డేట్ విడుదలైంది. ఈ కొత్త భద్రతా అప్‌డేట్ వల్ల టీనేజర్లు ఇకపై ఇన్‌స్టాగ్రామ్‌లో హింస, నగ్నత్వం, మత్తు పదార్థాల వాడకం, ప్రాణాపాయం కలిగించే సాహసకృత్యాలకు సంబంధించిన వీడియోలను చూడలేరు. ఒకవేళ ఎవరైనా టీనేజర్ అటువంటి విషయాల కోసం వెతికినా, అల్గోరిథం వాటిని గుర్తించి వెంటనే బ్లాక్ చేస్తుంది లేదా దాచిపెడుతుంది. ఈ మార్పులు మైనర్ల ఖాతాలకు వర్తిస్తాయి. అత్యంత కీలకమైన విషయం ఏమిటంటే, పిల్లలు ఈ సెట్టింగ్‌లను స్వయంగా మార్చుకోలేరు. దీని కోసం వారు తప్పనిసరిగా తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కేవలం వీడియోలే కాకుండా, ఇన్‌స్టాగ్రామ్ 'పరిమిత కంటెంట్' అనే కొత్త ఫీచర్‌ను కూడా ప్రవేశపెట్టింది. దీనివల్ల అపరిచితుల నుంచి వచ్చే సందేశాలు, కాల్స్ పరిమితం అవుతాయి. తద్వారా ఆన్‌లైన్ వేధింపులు, బెదిరింపుల నుంచి పిల్లలకు రక్షణ లభిస్తుంది. డిఫాల్ట్‌గా ఈ ఫీచర్ మైనర్ల ఖాతాలలో అందుబాటులో ఉంటుంది. ఇది వారి ఆన్‌లైన్ అనుభవాన్ని మరింత సురక్షితంగా మారుస్తుంది.

# భారత వృద్ధి రేటు అంచనా 6.6శాతం




2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు అంచనాలను స్వల్పంగా పెంచి 6.6 శాతానికి సవరించినట్లు ప్రపంచబ్యాంక్ తెలిపింది. ప్రారంభంలో జీఎస్‌టి రేట్ల తగ్గింపు వినియోగదారుల డిమాండ్‌ను పెంచినప్పటికీ పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులు వృద్ధిలో కోత విధించవచ్చని పేర్కొంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వృద్ధి అంచనాలను ఆర్‌బిఐ 6.9శాతం, ఒఇసిడి 6.1శాతం, మూడీస్ రేటింగ్స్ 6శాతంగా అంచనా వేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ బ్యాంక్ బుధవారం 'దక్షిణాసియా ఆర్థిక నివేదిక'ను విడుదల చేసింది. బలమైన దేశీయ డిమాండ్, ఎగుమతుల పటిష్టత కారణంగా, భారతదేశ వృద్ధి రేటు 2025లో నమోదైన 7.1శాతం నుండి 2026 ఆర్థిక సంవత్సరంలో 7.6శాతానికి వేగవంతమవుతుందని అంచనా వేసింది. తక్కువ ద్రవ్యోల్బణం, వస్తు సేవల పన్ను ( జిఎస్‌టి) క్రమబద్ధీకరణతో వ్యక్తిగత వినియోగ వృద్ధి వేగవంతమైందని పేర్కొంది. "పశ్చిమాసియా యుద్ధం కారణంగా నెలకొన్న ప్రతికూలతల కారణంగా 2027 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 6.6శాతానికి తగ్గుతుందని అంచనా వేస్తున్నాము" అని నివేదిక పేర్కొంది.

## ఇకపై గంట ఆలస్యంగా రూ. 10,000 పైన డిజిటల్ చెల్లింపులు




దేశంలో డిజిటల్ మోసాలు నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకోనుంది. ముఖ్యంగా యూపీఐ లావాదేవీలకు సంబంధించి అకౌంట్ నుంచి అకౌంట్‌కు బదిలీ చేసే అధిక మొత్తం లావాదేవీలను గంటసేపు నిలిపివేసేందుకు ఆర్‌బీఐ ప్రతిపాదించింది. 'డిజిటల్ చెల్లింపుల్లో భద్రతా చర్యల అన్వేషణ' చర్చా పత్రంలో ఆర్‌బీఐ ఈ మేరకు ప్రతిపాదనలు పేర్కొంది. ఇందుకు రూ. 10,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన డిజిటల్ లావాదేవీలను ప్రాసెస్ చేయడానికి ఒక గంట ఆలస్య నిబంధనను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఈ సమయంలో, వినియోగదారులకు లావాదేవీని రద్దు చేసుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ లావాదేవీ అనుమానాస్పదంగా అనిపిస్తే, దాన్ని కొనసాగించడానికి ముందు బ్యాంక్ కస్టమర్ నుంచి రీ-కన్ఫర్మేషన్ తీసుకోవలసి ఉంటుంది. మర్చంట్ పేమెంట్స్, ఓటీటీ లేదా ఇతర సబ్‌స్క్రిప్షన్, లోన్, ఇన్సూరెన్స్ వంటి లావాదేవీలు, చెక్కులకు మినహాయింపు ఉంటుంది.

# ఫార్మాకు ముడిపదార్థాల సరఫరా పెంపు



పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో, ఔషధ రంగానికి అవసరమైన కీలక ముడిపదార్థాల సరఫరాను ప్రభుత్వం పెంచుతోంది.

దేశీయంగా ప్రాణరక్షక ఔషధాల తయారీలో ఆటంకాలు ఎదురవ్వకుండా చూసేందుకు ప్రాధాన్యమిస్తోంది. పశ్చిమాసియా యుద్ధానికి ముందు, ఔషధ రంగానికి ముడిపదార్థాలు గుజరాత్‌లోని కాండ్లా నౌకాశ్రయం ద్వారా అధికంగా వచ్చేవి. అక్కడి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలి వెళ్లేవి. యుద్ధం వల్ల ఈ దిగుమతులకు అవరోధాలు ఎదురవుతున్నాయి. అయినా కూడా ఔషధ రంగానికి కీలకమైన ప్రొపిలీన్, అమ్మోనియా, మిథేన్ వంటి వాటిని, ప్రాధాన్యతకు అనుగుణంగా, దామాషా పద్ధతిలో ఔషధ సంస్థలకు అందిస్తున్నట్లు ఔషధశాఖ సంయుక్త కార్యదర్శి టీఎల్ సత్యప్రకాశ్ వెల్లడించారు. ప్రొపిలీన్‌ను భారత్ పెట్రోలియం కార్పొరేషన్ సహా దేశీయ రిఫైనరీలే ఔషధ కంపెనీలకు అందిస్తున్నాయని తెలిపారు. ఐబ్రూఫిన్ వంటి ఔషధాలకు కావాల్సిన ఐసోప్రొపైల్ ఆల్కహాల్, ఐసోబుటైల్ బెంజీన్ వంటి ఇంటర్మీడియెట్ల తయారీ కోసం ప్రొపిలీన్‌ను వినియోగిస్తారు. అమ్మోనియాను ఎరువుల రంగం నుంచి బదిలీ చేస్తున్నారు. ఇటీవల మెథనాల్ లభ్యతపై ఆందోళన నెలకొంది. అయితే అస్సాం పెట్రోకెమికల్స్, గుజరాత్ నర్మదా వ్యాలీ ఫెర్టిలైజర్స్ దీనిని ఔషధ కంపెనీలకు సరఫరా చేస్తున్నాయి.ఏప్రిల్ 1 నుంచి 40 పెట్రో రసాయనాలపై కస్టమ్స్‌ను ప్రభుత్వం తొలగించింది. దీనివల్ల ఔషధ సంస్థలకు తయారీ వ్యయాలు అదుపులోకి వస్తాయి. దాదాపు స్థిరంగానే ధరలు: ఔషధ రంగానికి కీలకమైన సాల్వెంట్స్, యాక్టివ్ ఫార్మా ఇంగ్రేడియెంట్ల సరఫరాలో అంతర్జాతీయంగా ఆటంకాలు ఎదురవుతున్నా, దేశీయంగా ఔషధ ధరలు దాదాపు స్థిరంగానే ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. మందుల తయారీలో వాడే మెట్‌ఫామిన్, ఆస్పిరిన్ వంటి ఇంటర్మీడియెట్ల ధరల కదలికలను చురుగ్గా గమనిస్తామని సత్యప్రకాశ్ వివరించారు. మార్ఫోలిన్ వంటి వాటిపై నాణ్యతా నిబంధనలను, మందుల ప్యాకేజింగ్‌కు వాడే అల్యూమినియంపై నిబంధనలనూ తాత్కాలికంగా సడలించినట్లు తెలిపారు. ఎల్‌పీజీ, హైస్పీడ్ డీజిల్ సరఫరాలు కూడా తగినన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు.

# రిఫైనరీ మార్జిన్లపై పరిమితి
# దేశీయ ఇంధన విక్రయాలపై నష్టాలు తగ్గించడానికే




దేశీయంగా ఇంధన సరఫరా మెరుగు పరచేందుకు, ఎగుమతులపై విండ్‌ఫాల్ పన్ను విధించిన ప్రభుత్వం.. తాజాగా రిఫైనరీ మార్జిన్లపై పరిమితి విధిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధర బాగా పెరిగినా, దేశీయంగా పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను సవరించలేదు. దీనివల్ల చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీ) భారీగా నష్టపోతున్నాయి. ముడిచమురును శుద్ధి చేసి, పెట్రోల్ - డీజిల్ వంటి ఇంధనాలుగా మార్చే రిఫైనరీలు మాత్రం.. ఓఎంసీలకు దిగుమతి ధర ప్రకారమే సరఫరా చేయడం ఇందుకు నేపథ్యం. ఓఎంసీలకు నష్టాలు తగ్గించేందుకే రిఫైనరీ మార్జిన్లలో కోత విధించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. దేశీయ సరఫరాల్లో కొరత నివారణకు: అంతర్జాతీయంగా చమురు సరఫరాల్లో ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

దేశీయంగా కూడా ఈ ప్రభావం పడుతోంది. ముడిచమురును ఇక్కడ శుద్ధి చేసి, విదేశాలకు పెట్రో ఉత్పత్తులను ఎగుమతి చేస్తే కంపెనీలకు అధిక లాభం వస్తుంది. అయితే సరఫరాలు తక్కువగా ఉన్నందున, దేశీయంగా కొరత తలెత్తకుండా చూసేందుకు గత నెలలో డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై ప్రత్యేక అదనపు సుంకాన్ని (ఎస్ఏఈడీ) ప్రభుత్వం విధించింది. దీంతో పాటు రిఫైనింగ్ మార్జిన్‌ను బ్యారెల్‌కు 15 డాలర్లకు పరిమితం చేసినట్లు సమాచారం. ఇప్పటికే లీటరుకు రూ.60 తగ్గించి ఇస్తున్న ఓఎంసీలు: రిఫైనరీలు దిగుమతి చేసుకుని, తమకు విక్రయించే పెట్రోలియం ఉత్పత్తులపై లీటరుకు రూ.60 వరకు తగ్గించి చెల్లించాలని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) ఇప్పటికే నిర్ణయించాయి. మార్చి ద్వితీయార్థానికి లీటర్ డీజిల్‌పై రూ.22.34, ఏప్రిల్ తొలి పక్షం రోజులకు రూ.60.24 తగ్గించి చెల్లిస్తున్నారు. ఏటీఎఫ్‌పై లీటరుకు రూ.50.56 రాయితీ, కిరోసిన్‌పై లీటరుకు రూ.46.31 తగ్గిస్తున్నట్లు సమాచారం.

# టాప్ 100 ప్రైవేట్ సంస్థల్లో రిలయన్స్ రిటైల్ 7వ స్థానం




ప్రపంచంలోనే అత్యంత విలువైన ప్రైవేట్ స్టార్టప్ కంపెనీల జాబితాలో రిలయన్స్ రిటైల్ ఏడో స్థానంలో నిలిచింది. స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ రీసెర్చ్ ప్రకారం, 100 బిలియన్? డాలర్ల(రూ. 9.24 లక్షల కోట్ల)కు పైగా విలువతో రిలయన్స్ రిటైల్ ఈ ఘనతను సొంతం చేసుకుంది. రిలయన్స్ రిటైల్ 'పోస్ట్-మనీ వాల్యుయేషన్' 100 బిలియన్? డాలర్లను దాటింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా 100 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన ఏడు కంపెనీల గ్రూపు హెక్టాకార్న్స్‌లో చేరింది. టాప్-7లో రిటైల్ రంగానికి చెందిన ఏకైక కంపెనీ రిలయన్స్ రిటైల్ కావడం విశేషం. ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, జీఐసీ, టీపీజీ, కేకేఆర్ వంటి గ్లోబల్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీకి పెట్టుబడులు వచ్చాయి. ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలు నిర్ణయించిన విలువ ద్వారానే ర్యాంకింగ్స్ కేటాయించారు. రిలయన్స్ రిటైల్‌తో పాటు, భారత్‌కు చెందిన మరో రెండు కంపెనీలు వెంచర్ క్యాపిటల్ మద్దతున్న టాప్-100 జాబితాలో ఉన్నాయి. 24 బిలియన్ డాలర్ల వాల్యుయేషన్‌తో ఎన్ఎస్ఈ ఇండియా 27వ స్థానం, 9 బిలియన్ డాలర్ల వాల్యుయేషన్‌తో టాటా ఈవీ 93వ స్థానంలో ఉన్నాయి.

# ఆకట్టుకున్న టీసీఎస్.. క్యూ4లో రూ.13,718 కోట్ల లాభం

దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) అంచనాలకుమించి రాణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.13,718 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.12,224 కోట్ల లాభంతో పోలిస్తే 12.22 శాతం వృద్ధి నమోదైందని వెల్లడించింది. అలాగే డిసెంబర్ త్రైమాసికంలో వచ్చిన రూ.10,657 కోట్ల లాభం కంటే భారీ వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషం. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 9.64 శాతం ఎగబాకి రూ.70,698 కోట్లకు చేరుకున్నది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, ఎండీ కే కృతివాసన్ మాట్లాడుతూ..వరుసగా మూడో త్రైమాసికంలోనూ ఆశాజనక పనితీరు కనబరిచినట్టు, ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ రెండంకెల వృద్ధిని సాధించినట్టు చెప్పారు. గడిచిన త్రైమాసికంలో కొత్తగా 12 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు, వీటిలో ఉత్తర అమెరికా నుంచి 5.4 బిలియన్ డాలర్ల ఒప్పందాలు రాగా, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల నుంచి మరో 2.8 బిలియన్ డాలర్ల ఒప్పందాలు వచ్చాయన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2.67 లక్షల కోట్ల ఆదాయంపై రూ.49,210 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

గడిచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీలో ఉద్యోగులు 23,460 మంది తగ్గుముఖం పట్టారు. వీరిలో టెక్నాలజీ రంగంలో వచ్చిన మార్పుల కారణంగా 12 వేల మంది సిబ్బందిని తొలగించింది. నాలుగో త్రైమాసికంలో కొత్తగా 2,356 మంది సిబ్బందిని మాత్రమే రిక్రూట్ చేసుకున్నది. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 5,84,519కి చేరుకున్నారు.



# మామిడి పండ్లు ఇలా తింటే ఆస్పత్రికి పరుగెత్తాల్సిందే!



వేసవిలో మాత్రమే దొరికే మామిడి పండ్లు ఎంత తినాలి? ఒక రోజులో ఎన్ని మామిడి పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిది? మామిడిని సరైన పద్ధతిలో ఎలా తినాలి అనే సందేహాలు మనలో చాలా మందికి ఉంటాయి. మామిడి పండ్లు రుచిగా ఉండటమే కాకుండా వాటిలో విటమిన్లు ఎ, సి, అనేక ఇతర పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. అయితే మామిడి పండ్లు అందరికీ మేలు.. వేసవి ప్రారంభమైంది. పండ్ల రారాజు మామిడి. వేసవిలో మాత్రమే దొరికే మామిడి పండ్లు ఎంత తినాలి? ఒక రోజులో ఎన్ని మామిడి పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిది? మామిడిని సరైన పద్ధతిలో ఎలా తినాలి అనే సందేహాలు మనలో చాలా మందికి ఉంటాయి. మామిడి పండ్లు రుచిగా ఉండటమే కాకుండా వాటిలో విటమిన్లు ఎ, సి, అనేక ఇతర పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. అయితే మామిడి పండ్లు అందరికీ మేలు చేయవు. కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి మామిడి పండ్లు తినడం ప్రమాదకరం. మీరు బరువు తగ్గాలని ప్రయత్నిస్తుంటే మామిడి పండ్లు కాస్త మితంగా తినాలి. మామిడి పండ్లలో కేలరీలు అధికంగా ఉంటాయి. ఒక మధ్యస్థ పరిమాణపు మామిడి పండు సుమారు 150 నుంచి 200 కేలరీలను అందిస్తుంది. దీనివల్ల బరువు పెరగవచ్చు. మామిడి పండ్లలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియకు మంచిదని భావిస్తారు. అయితే, మామిడి పండ్లను ఎక్కువగా తినడం వల్ల విరేచనాలు లేదా గ్యాస్ రావచ్చు. తరచుగా కడుపు సంబంధిత సమస్యలతో బాధపడేవారు మామిడి పండ్లను పరిమితంగా తినాలి. మామిడి తొక్క లేదా దానిలోని కొన్ని పదార్థాల వల్ల కొంతమందికి చర్మం దురద, దద్దుర్లు, కళ్ళు ఎర్రబడటం వంటి అలెర్జీ ప్రతిచర్యలు కలుగుతాయి. అలాంటి వారు జాగ్రత్తగా ఉండాలి. మామిడిని అధికంగా తినడం వల్ల శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరగవచ్చు. దీనివల్ల కీళ్లనొప్పులతో బాధపడే రోగులలో నొప్పి పెరగవచ్చు. మామిడి పండ్లను తినడానికి ముందు కనీసం 1-2 గంటల పాటు నీటిలో నానబెట్టాలి. దీనివల్ల వాటిలోని రసాయనక ప్రతిచర్యలు తగ్గుతాయి. రాత్రి పడుకునే ముందు మామిడి పండ్లు తినడం మానుకోవాలి. ఎందుకంటే దీనివల్ల జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మామిడి పండ్లలో తగినంత సహజ చక్కెర ఉంటుంది కాబట్టి వీటిని తినేటప్పుడు వాటికి చక్కెర కలపడం అంత మంచిదికాదు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు రోజుకు ఒక మధ్యస్థ పరిమాణంలో ఉన్న మామిడి పండు తింటే సరిపోతుంది. ఒకవేళ మీరు మామిడి పండ్ల ముక్కలు తింటుంటే రోజుకు ఒక చిన్న గిన్నెడు మామిడి పండ్లు తింటే సరిపోతాయి.

## పుదీనా చట్నీతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు..



వేసవిలో పుదీనా శరీరాన్ని చల్లబరుస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అడాప్టోజెన్ గుణాలు కలిగిన పుదీనా.. యాంటీఆక్సిడెంట్లు, విటమిన్-సి, ఫైబర్‌తో నిండి ఉంటుంది. పేగు ఆరోగ్యాన్ని కాపాడటానికి పుదీనా చట్నీని తినమని, పుదీనా పానీయాలు తాగమని ఆరోగ్య నిపుణులు సూచిస్తారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల నుండి మన శరీరాన్ని రక్షించుకోవడానికి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పుదీనా (ఓతినిబి ఒవజీలవబ) అద్భుతంగా పనిచేస్తుంది. ఈ కాలంలో ఏది పడితే అది తినడం ఆరోగ్యానికి హానికరం కావచ్చు. అందుకే పుదీనాతో చేసే వంటకాలు, ముఖ్యంగా పుదీనా చట్నీని తీసుకోవడం వల్ల ఆరోగ్యం, చల్లదనం లభిస్తాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అలాగే పుదీనా పానీయాలు వేసవిలో మన శరీరానికి ఉపశమనం కలిగిస్తాయి. పుదీనా ఆకుల్లో అడాప్టోజెన్ గుణాలు ఉంటాయి. ఇవి వేసవిలో శరీరాన్ని చల్లబరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పుదీనాలోని శీతలీకరణ శక్తి శరీరంలోని వేడిని తగ్గించడంలో సహాయపడుతుంది. వేసవిలో చల్లగా ఉండటానికి చాలామంది చల్లటి పదార్థాలను ఆశ్రయిస్తారు. కానీ అవి కొన్నిసార్లు ఆరోగ్యానికి హానికరంగా మారవచ్చు. అలాంటి సందర్భాల్లో, రుచి, ఆరోగ్యం రెండింటినీ పుదీనా వంటకాలు, పానీయాలు అందిస్తాయి.

ఆహారపు రుచిని పెంచే పుదీనా చట్నీని వేసవిలో ఎక్కువగా తినమని ఆరోగ్య నిపుణులు ప్రత్యేకంగా సిఫార్సు చేస్తారు. ఇది కేవలం రుచి కోసమే కాకుండా, కడుపు ఆరోగ్యానికి కూడా మంచిదని నమ్ముతారు. పుదీనా చట్నీ కడుపు ఆరోగ్యానికి ప్రయోజనకరమైన ఔషధంగా పరిగణించబడుతుంది. ఇది శరీరాన్ని సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా వేసవిలో జీర్ణక్రియ, ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పుదీనాలో సహజసిద్ధంగా యాంటీఆక్సిడెంట్లు, విటమిన్-సి, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. పిప్పర్ మెంట్ లోని శీతలీకరణ శక్తి పేగు ఆరోగ్యాన్ని శాంతపరచడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, దీనిలోని యాంటీ-బాక్టీరియల్, యాంటీ-సెప్టిక్ లక్షణాలు పేగు సూక్ష్మజీవులను ఆరోగ్యంగా ఉంచడంలో తోడ్పడతాయి. పుదీనా చట్నీలో విటమిన్-సి, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఈ సాంప్రదాయ చట్నీ తయారీలో ఉపయోగించే మూలికలు, సుగంధ ద్రవ్యాల మిశ్రమం పేగు ఆరోగ్యాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది. ఇంట్లో పుదీనా చట్నీని తయారు చేసుకోవడం చాలా సులభం. ముందుగా పుదీనా ఆకులను శుభ్రంగా కడిగి నీటిలో నానబెట్టి, ఆపై వడకట్టి బాగా కడగాలి. ఆ తర్వాత ఒక బ్లెండర్ తీసుకుని అందులో పుదీనా ఆకులు, మూడు వెల్లుల్లి రెబ్బలు, ఒక అంగుళం అల్లం, రెండు పచ్చిమిర్చి వేసి మెత్తగా పేస్ట్ చేయాలి. చాట్ మసాలాతో పాటు ఉప్పు, ఎండుమిర్చి, నిమ్మరసం జోడించి మళ్లీ బ్లెండ్ చేసి తాజా చట్నీని ఆస్వాదించండి. వేసవిలో ఈ చట్నీని ఫ్రిడ్జ్లో నిల్వ చేసి చాలా రోజుల వరకు ఉపయోగించుకోవచ్చు.

## వేసవిలో ముక్కు నుండి రక్తం కారుతోందా?

వేసవి కాలం వచ్చిందంటే చాలు.. ఎండలతో పాటు రకరకాల ఆరోగ్య సమస్యలు మనల్ని చుట్టుముడతాయి. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల మన శరీరంలో కూడా వేడి పెరుగుతుంది. ఈ క్రమంలో చాలా మంది ఎదుర్కొనే ఒక సాధారణ సమస్య 'ముక్కు నుండి రక్తం కారడం' (ఔనీబవఎశ్రీవవట). అకస్మాత్తుగా ముక్కు నుండి రక్తం రావడం చూసి ఎవరైనా భయపడటం సహజం. ఎండాకాలంలో డీహైడ్రేషన్ సమస్య ఎంత సహజమో ఇది కూడా అంతే కామన్. ఇతర నమ్మకాలతో దీనికి సంబంధం లేదు. ఇది పూర్తిగా వాతావరణ మార్పులు శరీర స్థితిపై ఆధారపడి ఉంటుంది. ముక్కు లోపలి పొర చాలా సున్నితంగా ఉంటుంది. పొడి గాలి: వేసవిలో గాలిలో తేమ తగ్గిపోయి, వేడి మరియు పొడి గాలి వీస్తుంది. దీనివల్ల ముక్కు లోపలి సున్నితమైన రక్తనాళాలు ఎండిపోయి చిట్లిపోతాయి. శరీర ఉష్ణోగ్రత: బయట ఉష్ణోగ్రత పెరిగినప్పుడు శరీరంలో కూడా వేడి పెరిగి రక్తనాళాలపై ఒత్తిడి పడుతుంది. ఇతర కారణాలు: అలర్జీలు, సైనస్ ఇన్ఫెక్షన్లు, ముక్కులో వేలు పెట్టుకోవడం లేదా గట్టిగా తుమ్మడం వల్ల కూడా రక్తస్రావం జరగవచ్చు. అధిక రక్తపోటు ఉన్నవారిలో కూడా ఈ సమస్య కనిపిస్తుంది. నిటారుగా కూర్చోండి: పడుకోవడం కంటే నిటారుగా కూర్చోవడం మంచిది. తలను కొద్దిగా ముందుకు వంచండి (వెనక్కి వంచకూడదు). ముక్కును నొక్కండి: బొటనవేలు, చూపుడు వేలుతో ముక్కులోని మెత్తని భాగాన్ని 10 నుండి 15 నిమిషాల పాటు గట్టిగా నొక్కి పట్టుకోండి. ఐస్ ప్యాక్: ముక్కు పైన లేదా నుదుటిపై ఐస్ ముక్కలు లేదా చల్లటి పట్టీని ఉంచండి. ఇది రక్తనాళాలను సంకోచింపజేసి రక్తస్రావాన్ని ఆపుతుంది.

# స్క్రీన్ లైఫ్ వర్సెస్ ఫిట్నెస్

మెడ, భుజాల నొప్పులకు వ్యాయామాలే పరిష్కారం!ఇప్పటి డిజిటల్ ప్రపంచంలో మెడ, భుజాల నొప్పి ఒక సాధారణ సమస్యగా మారింది. పని కోసం గంటల తరబడి కంప్యూటర్ ముందు కూర్చోవడం, ఫోన్ వినియోగం, ట్రాఫిక్‌లో ఒత్తిడితో ప్రయాణాలు వంటి కారణాలతో లక్షలాది మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. తప్పు భంగిమ, ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కండరాల ఒత్తిడి, రోజువారీ జీవిత ఒత్తిడి వంటి అంశాలు ఈ నొప్పులకు దారితీస్తున్నాయి. ఈ సమస్యలు నిద్రను దెబ్బతీయడమే కాకుండా కదలికలను తగ్గించి తలనొప్పులకు కూడా కారణమవుతాయి. అయితే కొన్ని సులభమైన వ్యాయామాలతో ఈ సమస్యలను తగ్గించుకోవచ్చు. ఈ వ్యాయామాలను కొద్ది నిమిషాల పాటు చేయడం ద్వారా గట్టిపడిన కండరాలను చాచడం, బలపరచడం, శరీర సమతుల్యతను పునరుద్ధరించడం సాధ్యమవుతుంది. ఇవి నొప్పి తగ్గించడమే కాకుండా భవిష్యత్తులో సమస్యలను నివారించడంలో కూడా సహాయపడతాయి. మెడ, భుజాల నొప్పిని తగ్గించే కొన్ని సులభమైన వ్యాయామాలు ఇలా ఉన్నాయి.



### మెడ టిల్ట్స్

మెడ టిల్ట్స్ వ్యాయామం స్క్రీన్ ముందు ఎక్కువసేపు ఉండడం వల్ల గట్టిపడే మెడ పక్క కండరాలపై ప్రభావం చూపుతుంది. నిటారుగా కూర్చుని లేదా నిలబడి, భుజాలను రిలాక్స్‌గా ఉంచాలి. నెమ్మదిగా తలను ఒక వైపుకు వంచి, చెవిని అదే వైపు భుజానికి దగ్గర చేయాలి. 15 నుంచి 30 సెకన్ల పాటు ఆ స్థితిలో ఉండి సమంగా శ్వాస తీసుకోవాలి. తరువాత మరో వైపుకు కూడా ఇదే విధంగా చేయాలి. ప్రతి వైపుకు 3 సార్లు చేయడం మంచిది. ఇది రోజులో పలుమార్లు, ముఖ్యంగా ఉదయం లేవగానే లేదా నిద్రకు ముందు చేయడం వల్ల ఒత్తిడి తగ్గి రక్త ప్రసరణ మెరుగవుతుంది.

### షోల్డర్ రోల్స్

ల్యాప్‌టాప్ ముందు వంగి కూర్చోవడం వల్ల పైభాగం వెన్ను, భుజాల కండరాలు గట్టిపడతాయి. షోల్డర్ రోల్స్ ఈ సమస్యను తగ్గించడంలో సహాయపడతాయి. నిలబడి లేదా సౌకర్యంగా కూర్చుని, శ్వాస తీసుకుంటూ భుజాలను చెవుల వైపు పైకెత్తి తరువాత ముందుకు గుండ్రంగా తిప్పాలి. 10-15 సెకన్ల పాటు ఇలా చేసి, తరువాత వెనుకవైపు తిప్పాలి. ప్రతి దిశలో 5-10 సార్లు చేయాలి. దీన్ని రోజుకు రెండు సార్లు చేయడం ద్వారా రక్తప్రసరణ పెరిగి భంగిమ మెరుగుపడుతుంది.

### చిన్ టక్స్

ఫోన్ వినియోగం వల్ల వచ్చే ఫార్వర్డ్ హెడ్ పొజిషన్‌ను సరిచేయడంలో చిన్ టక్స్ ఉపయోగపడతాయి. నిటారుగా కూర్చుని తలను కదపకుండా గడ్డాన్ని వెనక్కి తీసుకురావాలి. 5 సెకన్ల పాటు ఆ స్థితిలో ఉంచి వదలాలి. రోజుకు 2-3 సార్లు ప్రతి సారి 10 రిపిటేషన్లు చేయాలి. ఇది మెడ కండరాలను బలపరచి నొప్పిని తగ్గిస్తుంది.

### అక్రాస్ ది చెస్ట్ స్ట్రెచ్

భుజాలు వంగిపోవడం వల్ల గట్టిపడే కండరాలను సడలించడంలో ఈ వ్యాయామం సహాయపడుతుంది. ఒక చేతిని భుజాల ఎత్తులో సూటిగా ముందుకు చాపి, మరో చేతితో దాన్ని ఛాతీ వైపు నెమ్మదిగా లాగాలి. 20-30 సెకన్ల పాటు ఉంచి, ప్రతి వైపుకు 3-5 సార్లు చేయాలి. ఇది భుజాల కండరాలను రిలాక్స్ చేస్తుంది.

### ఈర్ టు షోల్డర్ స్ట్రెచ్

ఈ వ్యాయామం మెడ కండరాలను సడలిస్తుంది. తలను నెమ్మదిగా ఒక వైపు వంచి, అవసరమైతే చేతితో స్వల్ప ఒత్తిడి ఇవ్వాలి. 20-40 సెకన్ల పాటు ఉంచి, ప్రతి వైపుకు 3 సార్లు చేయాలి. ఇది ఒత్తిడి వల్ల వచ్చే తలనొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది.

### సీటెడ్ ట్విస్ట్

ఈ వ్యాయామం వెన్నెముకను సడలించి మెడ, భుజాలపై ఒత్తిడిని తగ్గిస్తుంది. కుర్చీలో కూర్చుని, ఒక చేతిని ఎదురుగా ఉన్న మోకాలిపై ఉంచి, మరో చేతిని వెనుక ఉంచి శరీరాన్ని మెల్లగా తిప్పాలి. ప్రతి వైపుకు 20-30 సెకన్ల పాటు 3 సార్లు చేయాలి. ఇది ఎక్కువసేపు కూర్చునే వారికి ఎంతో ఉపయోగకరం.

### చైల్డ్ పోజ్

ఈ యోగా భంగిమ మొత్తం శరీరాన్ని రిలాక్స్ చేస్తుంది. మోకాళ్లపై కూర్చుని, ముందుకు వంగి చేతులను ముందుకు చాపి నుదుటిని నేలపై ఉంచాలి. 30-60 సెకన్ల పాటు లోతుగా శ్వాస తీసుకోవాలి. రోజుకు 3-5 సార్లు చేయడం ద్వారా శరీర ఒత్తిడి తగ్గుతుంది.

ఈ సరళమైన వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయడం ద్వారా మెడ, భుజాల నొప్పులను సమర్థవంతంగా నియంత్రించవచ్చు. సరిగ్గా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం సాధ్యమవుతుంది.

# మజ్జిగ తాగితే మంచిదా!

పెరుగు, మజ్జిగ... దాదాపు ఒకే రకమైన పోషకాలను కలిగి ఉంటాయి. అయినప్పటికీ, ఈ రెండింటిలో ఏది మంచిది అనే సందేహం చాలా మందికి కలుగుతుంది. కేవలం పెరుగుకు నీళ్ళు కలపడం ద్వారా దానిని మజ్జిగగా మార్చవచ్చు. కానీ అలా చేయడం వల్ల పెరుగు గుణాలు కూడా మారుతాయా? సమాధానం అవును. వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరచడానికి పెరుగు, మజ్జిగ రెండూ మంచివే అయినప్పటికీ, వేసవి తాపాన్ని తట్టుకోవడానికి ఏది ఉత్తమమో చూద్దాం. ఎండలు మండిపోతున్న వేళ మన ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం చాలా అవసరం. వేసవిలో చల్లదనం కోసం అందరూ పెరుగు లేదా మజ్జిగను ఆశ్రయిస్తారు. అయితే ఈ రెండింటిలో ఏది ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుందో తప్పక తెలుసుకోవాలి. పెరుగు , మజ్జిగ రెండూ పాల ఆధారిత ఉత్పత్తులే. ఒకే కూర్పును కలిగి ఉంటాయి. దాదాపు ఒకే రకమైన పోషకాలను కలిగి ఉంటాయి. అయినప్పటికీ, ఈ రెండింటిలో ఏది మంచిది అనే సందేహం చాలా మందికి కలుగుతుంది. కేవలం పెరుగుకు నీళ్ళు కలపడం ద్వారా దానిని మజ్జిగగా మార్చవచ్చు. కానీ అలా చేయడం వల్ల పెరుగు గుణాలు కూడా మారుతాయా? సమాధానం అవును. 1. హైడ్రేషన్: మజ్జిగలో దాదాపు 90 శాతం నీరు ఉంటుంది. ఎండల వల్ల శరీరంలోని నీటి శాతం తగ్గినప్పుడు మజ్జిగ తాగడం వల్ల తక్షణమే శక్తి వస్తుంది. పెరుగు చిక్కగా ఉండటం వల్ల అది శరీరానికి నీటిని అందించడంలో మజ్జిగ అంత ప్రభావవంతంగా ఉండదు. 2. జీర్ణక్రియ : పెరుగు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఇది కొన్నిసార్లు వేసవిలో కడుపులో భారాన్ని కలిగిస్తుంది. మజ్జిగ తేలికగా జీర్ణం కావడమే కాకుండా, మనం తిన్న ఆహారం త్వరగా అరగడానికి సహాయపడుతుంది.



మజ్జిగలో కొద్దిగా జీలకర్ర పొడి, అల్లం కలిపితే జీర్ణశక్తి రెట్టింపు అవుతుంది. 3. శరీర ఉష్ణోగ్రత: ఆయుర్వేదం ప్రకారం, పెరుగు స్వభావరీత్యా కొంత వేడిని కలిగిస్తుంది. కానీ దానిని చిలికి మజ్జిగలా మార్చినప్పుడు అది శీతలీకరణ ప్రభావాన్ని ఇస్తుంది. అందుకే వేసవిలో పెరుగు కంటే మజ్జిగ తాగడం వల్ల శరీరం చల్లబడుతుంది. 4. బరువు నియంత్రణ: పెరుగులో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారు లేదా క్యాలరీలను తగ్గించుకోవాలనుకునే వారు మజ్జిగను ఎంచుకోవడం ఉత్తమం. ఇందులో ప్రోటీన్లు ఉన్నప్పటికీ క్యాలరీలు చాలా తక్కువ. 5. పోషక విలువలు: ఎముకల బలానికి, దంతాల ఆరోగ్యానికి అవసరమైన క్యాల్షియం పెరుగులో పుష్కలంగా ఉంటుంది. మీకు క్యాల్షియం లోపం ఉంటే పెరుగు మంచిది. కానీ ఎండల నుండి ఉపశమనం కావాలంటే మాత్రం మజ్జిగనే మేలు. మొత్తానికి వేసవిలో మజ్జిగ సంపూర్ణ పానీయం. అయితే మీరు పెరుగు తినాలనుకుంటే మధ్యాహ్నం సమయంలో తీసుకోవడం మంచిది, రాత్రిపూట పెరుగు తినడం వల్ల శ్లేష్మం పెరిగే అవకాశం ఉంది. ప్రతిరోజూ కనీసం రెండు గ్లాసుల పలచని మజ్జిగ తాగడం వల్ల మీ ఆరోగ్యం పదిలంగా ఉంటుంది.

# ఆపిల్ తిన్న వెంటనే నీళ్లు తాగుతున్నారా..?



ఆపిల్ ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కానీ ఆపిల్ తిన్న వెంటనే నీళ్లు తాగితే మీ కొంప మునిగే అవకాశం ఉంది.. వేల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ అద్భుత ఫలం గురించి వైద్య నిపుణులు ఏమంటున్నారు. ఈ పండులో ఉన్న పోషకాలు ఏంటి? అసలు ఆపిల్ తిన్న తర్వాత నీళ్లు ఎందుకు తాగకూడదు? రోజుకో ఆపిల్ తింటే డాక్టర్ అవసరం ఉండదు అన్నది నానుడి. ఆపిల్ కేవలం ఒక పండు మాత్రమే కాదు.. అది ఒక అద్భుత ఔషధం. మన ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా, విజ్ఞాన శాస్త్రంలో గురుత్వాకర్షణ శక్తిని కనిపెట్టడానికి కూడా ఇదే కారణమైంది. చాలా మంది ఆపిల్ తిన్న వెంటనే దాహంగా ఉందని నీళ్లు తాగుతుంటారు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇది అత్యంత ప్రమాదకరమైన అలవాటు. ఆపిల్ తిన్న వెంటనే నీళు తాగడం వల్ల కడుపులోని జీర్ణరసాలు పలచబడతాయి. దీనివల్ల ఆహారం సరిగ్గా అరగకపోవడంతో పాటు కడుపు ఉబ్బరం, గ్యాస్, జీర్ణ రుగ్మతలు, గుండెల్లో మంట వంటి సమస్యలు తలెత్తుతాయి. ఆపిల్ తిన్న తర్వాత కనీసం 30 నుండి 60 నిమిషాల వరకు నీళ్లు తాగకపోవడమే ఉత్తమం. ఒకవేళ తప్పనిసరి అయితే కేవలం ఒక గుక్కెడు నీరు మాత్రమే తీసుకోవాలి. ఆపిల్ పండు ఇప్పుడే పుట్టింది కాదు.. దీనికి వేల ఏళ్ల చరిత్ర ఉంది. వృక్షశాస్త్రవేత్తల ప్రకారం.. ఆపిల్ మొట్టమొదట మధ్య ఆసియాలోని కజకిస్తాన్‌లో క్రీ.పూ. 10,000 ప్రాంతంలో కనిపించింది. ప్రాచీన భారతీయ వైద్య గ్రంథం చరక సంహితలో కూడా ఆపిల్ ప్రస్తావన ఉంది. మన పూర్వీకులు దీనిని శరీరాన్ని చల్లబరిచే పండుగా గుర్తించారు. సర్ ఐజాక్ న్యూటన్ తలపై ఆపిల్ పడటంతోనే ఆయన గురుత్వాకర్షణ నియమాన్ని కనుగొన్నారన్న సంగతి మనందరికీ తెలిసిందే. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 7,500 రకాల ఆపిల్స్ అందుబాటులో ఉన్నాయి. ఒక సాధారణ పరిమాణంలో ఉండే ఆపిల్ మన శరీరానికి అవసరమైన ఎన్నో పోషకాలను అందిస్తుంది. ఇందులో 52 కేలరీలు, 13.8 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఉంటాయి. 2.4 గ్రాములు ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. విటమిన్ సి, పొటాషియం, మాంగనీస్, రాగి పుష్కలంగా ఉంటాయి. ఇందులోని ట్రిప్టోఫాన్ నిద్రలేమి, ఒళ్లు నొప్పులను తగ్గించి మానసిక ప్రశాంతతను ఇస్తుంది.

## చెన్నై సూపర్ కింగ్స్ సరైనా ప్లేయర్స్‌ని తీసుకోలే..

# CSKపై మాజీ క్రికెటర్ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టుగా పేరుగాంచిన చెన్నై సూపర్ కింగ్స్, ప్రస్తుతం గడ్డు పరిస్థితులని ఎదుర్కొంటోంది. 2025 సీజన్‌లో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన సీఎస్కే.. ప్రస్తుత 2026 సీజన్‌లో కూడా ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి హ్యాట్రిక్ పరాజయాలను మూటగట్టుకుంది. దీంతో జట్టు ఎంపిక, వేలంలో తీసుకున్న నిర్ణయాలపై మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ చేసిన విమర్శలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి.

**ధరకు తగ్గ ప్రదర్శన ఎక్కడ?:**

మినీ వేలంలో ప్రశాంత్ వీర్, కార్తిక్ శర్మ అనే ఇద్దరు ప్లేయర్స్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ ఏకంగా ఒక్కొక్కరికి రూ. 14 కోట్లకు పైగా ఖర్చు చేసింది. అయితే, ఇప్పటి వరకు వారు ఆడిన తీరు చూస్తుంటే అంత భారీ ధర పెట్టడం అవసరమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని బద్రీనాథ్ అన్నారు. ఎవరో ఇచ్చిన సలహాలు విని అంత డబ్బు ధారపోశారు, కానీ క్షేత్రస్థాయిలో వారి ప్రదర్శన మాత్రం నిరాశాజనకంగా ఉందని విమర్శించారు.

**స్కౌటింగ్ వైఫల్యంపై విమర్శలు:**

ప్రతిభ గల ఆటగాళ్లను గుర్తించడంలో సీఎస్కే ఇతర జట్ల కంటే వెనుకబడి ఉందని సుబ్రమణ్యం బద్రీనాథ్ తెలిపారు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కోసం హేమంగ్ బదానీ, వేణుగోపాల్ రావు లాంటి వారు ప్రపంచవ్యాప్తంగా ఉన్న లీగ్‌లను గమనిస్తూ ఆటగాళ్లను వెలికితీస్తారని కొనియాడారు. ముంబై ఇండియన్స్ జట్టుకు జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా లాంటి దిగ్గజాలు దొరకడానికి కారణం వారి స్కౌట్ జాన్ రైట్.. సీఎస్కేకు అటువంటి పటిష్టమైన స్కౌటింగ్ వ్యవస్థ లేకపోవడం మైనస్ అని వెల్లడించారు.

**శనివారం ఢిల్లీతో కీలక పోరు**

వరుస ఓటములతో కుంగిపోయిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు, తమ తదుపరి మ్యాచ్‌లో భాగంగా శనివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి ఫామ్‌లోకి రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే బద్రీనాథ్ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే, జట్టులో సమూల మార్పులు జరిగితే తప్ప సీఎస్కేకి పూర్వ వైభవం రాదని స్పష్టమవుతోంది.

## నీవు నా కొడుకు కెరీర్ ముగించేశావు: క్రిస్ బ్రాడ్ ఆవేదన.. యువీ రియాక్షన్!

**హైదరాబాద్ పెన్ పవర్:** 2007 టీ20 ప్రపంచకప్‌లో యువరాజ్ సింగ్ ఒకే ఓవర్లో ఆరు సిక్సర్ల విధ్వంసం క్రికెట్ చరిత్రలో ఒక అద్భుతం. అయితే ఆ ఘటన తర్వాత మైదానం వెలుపల జరిగిన కొన్ని ఆసక్తికరమైన విషయాలను యువీ ఇటీవల 'ది ఓవర్ లాప్' షోలో పంచుకున్నాడు. ఆ సిక్సర్ల వర్షం స్టువర్ట్ బ్రాడ్ కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపిందో, అతని తండ్రి క్రిస్ బ్రాడ్ ఎలా స్పందించారో యువీ వివరించాడు.ఆ మ్యాచ్‌కు రిఫరీగా ఉన్న స్టువర్ట్ బ్రాడ్ తండ్రి క్రిస్ బ్రాడ్ మ్యాచ్ ముగిశాక యువరాజ్ వద్దకు వచ్చి, "నువ్వు దాదాపు నా కొడుకు కెరీర్‌ను ముగించేశావు" అని అన్నారట. ఒక తండ్రిగా తన కొడుకు పడుతున్న బాధను ఆయన అలా వ్యక్తం చేశారు. దానికి యువీ స్పందిస్తూ.. "సర్, గతంలో నా బౌలింగ్‌లో కూడా ఐదు సిక్సర్లు పడ్డాయి, ఆ బాధ నాకు తెలుసు" అని ఆయనను ఓదార్చే ప్రయత్నం చేశాడు.ఆ తర్వాత క్రిస్ బ్రాడ్ కోరిక మేరకు ఒక జెర్సీపై యువీ సంతకం చేస్తూ.. "నువ్వు భవిష్యత్తులో ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్‌గా ఎదుగుతావని ఆశిస్తున్నాను" అని రాసిచ్చాడు.

అయితే, ఆ జెర్సీని స్టువర్ట్ బ్రాడ్ కోపంతో డస్ట్‌బిన్‌లో పడేశాడని యువీకి ఇటీవల తెలిసింది. "అంతటి అవమానం జరిగినప్పుడు ఆ కోపం రావడం సహజమే, అది తప్పు కాదు" అని యువీ చాలా పరిణతితో స్పందించాడు. ఆ ఎదురుదెబ్బతో కుంగిపోకుండా బ్రాడ్ 600 పైగా టెస్ట్ వికెట్లు తీసి లెజెండరీ బౌలర్‌గా ఎదగడం గొప్ప విషయమని యువీ కొనియాడాడు.



## పంత్ భాయ్ చెప్పాడు.. నేను కొట్టాను: లక్నో హీరో ముకుల్ చౌదరి



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్‌లో ప్రతిభకు కొదవ లేదు. కానీ సరైన అవకాశం, మార్గదర్శకత్వం లభించినప్పుడే యువ ఆటగాళ్లు సంచలనాలు సృష్టిస్తారు. లక్నో సూపర్‌జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) యువ బ్యాటర్ ముకుల్ చౌదరి విషయంలో ఇదే జరిగింది. గురువారం ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో జరిగిన మ్యాచ్‌లో 22 ఏళ్ల ముకుల్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో తన జట్టుకు ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు. 182 పరుగుల లక్ష్య ఛేదనలో లక్నో కష్టాల్లో ఉన్నప్పుడు క్రీజులోకి వచ్చిన ముకుల్, కేకేఆర్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అవేశ్ ఖాన్‌తో కలిసి 54 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఇందులో విశేషమేమిటంటే, అవేశ్ ఖాన్ కేవలం ఒక పరుగు మాత్రమే చేయగా, మిగిలిన 52 పరుగులు ముకుల్ బాదడం విశేషం. చివరి బంతికి బౌండరీ కొట్టి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.మ్యాచ్ అనంతరం ముకుల్ మాట్లాడుతూ తన ప్రదర్శన వెనుక కెప్టెన్ రిషబ్ పంత్ ఇచ్చిన సలహా ఉందని వెల్లడించాడు. "గతంలో మ్యాచ్‌లను ముగించడానికి చాలా తొందరపడేవాడిని. కానీ ఇప్పుడు ప్రశాంతంగా ఉండటంపై దృష్టి పెట్టాను. ఆటను చివరి వరకు తీసుకెళ్తే గెలిపించగలనని నమ్ముతున్నా" అని తెలిపాడు."గత మ్యాచ్‌లో సరిగా టైమింగ్ చేయలేకపోయాను. దాంతో రిషబ్ భాయ్‌తో మాట్లాడాను. 'నువ్వు అతిగా ఆలోచిస్తున్నావు. నీ పనిపై దృష్టి పెట్టు. బంతిని చూసి ఆడు. నీపై నాకు నమ్మకం ఉంది. నీపై నీకు కూడా నమ్మకం ఉండాలి' అని చెప్పాడు. ఆ మాటలు నాలో ఆత్మవిశ్వాసం నింపాయి" అని ముకుల్ వివరించాడు. పంత్ ఇచ్చిన భరోసాతోనే ఎలాంటి ఒత్తిడి లేకుండా తన సహజమైన ఆట ఆడి జట్టును గెలిపించగలిగానని ముకుల్ పేర్కొన్నాడు.

# బ్లూ జీన్స్‌లో ఈషా గ్లామర్ టచ్.. నెట్టింట ట్రెండ్



తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వరంగల్ చిన్నది ఈషా రెబ్బా, తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలతో నెటిజన్ల మనసు దోచుకుంటోంది. బ్లూ అండ్ బ్లూ జీన్స్ లుక్‌లో ఆమె కనిపిస్తున్న తీరు ఎంతో స్టైలిష్‌గా, అదే సమయంలో చాలా సింపుల్‌గా ఉంది. కస్సుమనే చూపులతో, డిఫరెంట్ స్టిల్స్‌లో ఈషా పంచుకున్న ఈ ఫోటోలు ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతూ ట్రెండింగ్‌లో నిలిచాయి. సంప్రదాయ దుస్తుల్లోనే కాకుండా, ఇలాంటి వెస్ట్రన్ వేర్‌లో కూడా ఆమె గ్లామర్ అదిరిపోయిందని ఫ్యాన్స్ కామెంట్లతో ముంచెత్తుతున్నారు.

**డెనిమ్ లుక్‌లో ఈషా మెరుపులు:**

తాజా ఫోటో షూట్‌లో ఈషా రెబ్బా పూర్తి డెనిమ్ లుక్‌లో దర్శనమిచ్చింది. బ్లూ కలర్ జీన్స్ షర్ట్, దానికి తగ్గట్టుగా జీన్స్ ప్యాంటు ధరించి ఒక నేచురల్ లుక్‌ను సొంతం చేసుకుంది. ఫోటోలో ఆమె కింద కూర్చుని, ఒక చేత్తో ఎల్లో కలర్ 'మినియన్' మగ్‌ను పట్టుకుని, మరో చేతిని తలకు ఆనించి సీరియస్ లుక్ ఇస్తున్న తీరు చాలా ఆకర్షణీయంగా ఉంది. ఇక ఎలాంటి ఆడంబరాలు లేకుండా చాలా సింపుల్‌గా కనిపిస్తూనే, తన కళ్ళతో నెటిజన్లను మెస్మరైజ్ చేస్తోంది. ఈ 'డబుల్ డెనిమ్' ట్రెండ్ ఈషాకు పర్ఫెక్ట్‌గా సెట్ అయిందని చెప్పవచ్చు.

**తెలుగమ్మాయి ప్రయాణం.. సినిమాల సందడి:**



ఇక లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ సినిమాతో కెరీర్ మొదలుపెట్టిన ఈషా, అంతకు ముందు ఆ తర్వాత చిత్రంతో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగమ్మాయి కావడంతో మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురైనా, తన నటనతో ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చింది. అమీ తుమీ, బందిపోటు వంటి సినిమాల్లో తన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకుంది. ఇక నాని నిర్మించిన అ సినిమాతో పాటు, ఎన్టీఆర్-త్రివిక్రమ్ కాంబోలో వచ్చిన 'అరవింద సమేత'లో ఒక కీలక పాత్రలో నటించి స్టార్ హీరోల సినిమాల్లోనూ తన సత్తా చాటింది. ప్రస్తుతం ఆమె బాలీవుడ్ ఎంట్రీకి కూడా సిద్ధమవుతోంది.

**సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్:**

ఈషా రెబ్బా సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటుంది. షూటింగ్ విశేషాలతో పాటు తన వ్యక్తిగత ఫోటోలను కూడా ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌తో పంచుకుంటుంది. హీరోయిన్‌గానే కాకుండా, సెకండ్ హీరోయిన్‌గా కూడా వైవిధ్యమైన పాత్రలు చేస్తూ విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. ఇక రీసెంట్ గా 'మామా మశ్చీంద్ర', 'ఓం శాంతి శాంతి శాంతిః' వంటి మూవీ లతో అలరించిన ఈ భామ, కేవలం తెలుగుకే పరిమితం కాకుండా తమిళ్, మలయాళ భాషల్లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. అందుకే ఆమెకు దక్షిణాది అంతటా ఫాలోయింగ్ పెరుగుతోంది.

**స్టార్ ఇమేజ్ దిశగా అడుగులు:**

ప్రస్తుతం ఈషా రెబ్బా పంచుకున్న ఈ బ్లూ జీన్స్ పిక్స్ ఆమె గ్లామర్ రేంజ్‌ను మరోసారి చాటిచెప్పాయి. ఫోటోలో ఆమె కూర్చున్న భంగిమ, ఆ ఎల్లో మగ్ కాంబినేషన్ నెటిజన్లను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. చిన్న సినిమాల నుంచి మొదలై ఈరోజు పాన్ ఇండియా స్థాయికి ఎదిగేందుకు ఈషా చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. గ్లామర్ ప్లస్ టాలెంట్ ఉన్న ఈ వరంగల్ బ్యూటీ, త్వరలోనే బాలీవుడ్ లోనూ జెండా పాతాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈషా ఇలాంటి మరిన్ని విభిన్నమైన ఫోటోషూట్‌లతో అభిమానులను అలరించాలని ఆశిద్దాం.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965